తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
16-06-2026
మంగళవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 128
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



3

## 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షా లు

- నిరంతరం అప్రమత్తత అవసరం
- విపత్తుల నిర్వహణ యంత్రాంగం సిద్ధంగా ఉండాలి
- రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి



2

## తెలంగాణవ్యాప్తంగా రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్..

- 245 స్కూల్ బస్సులపై కేసులు.. 60 సీజ్
- ఇంకా ఫిట్‌నెస్ పొందని 2,783 బస్సులు
- పాఠశాలల పునఃప్రారంభం వేళ రవాణాశాఖ తనిఖీలు

## బడికి 'అమావాస్య' ఎఫెక్ట్!

- మొదటి రోజు వెలవెలబోయిన పాఠశాలలు
- టీచర్ల సంఖ్యకే పరిమితమైన విద్యార్థులు

2



# మెట్రో ఫేజ్ 2 పూర్తి చేయడమే లక్ష్యం

- మంజూరైన లోన్ బదిలీని కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు
- తక్కువ వడ్డీ రుణం ఆపిన ఐఆర్ఎఫ్‌సీ
- కేంద్రానికి ఇష్టం లేకపోతే ఎన్ఓసీ ఇవ్వాలి
- కిషన్ రెడ్డి వెనుకుండి కేటీఆర్ కుట్రలు చేస్తున్నారు
- సాయంత్ర వరకు రుణమాఫీ చేస్తే సన్మానం చేస్తా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణలో అభివృద్ధి ఉరుకులు పరుగులు పెడుతుంటే చూసి ఓర్వలేక, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాష్ట్రానికి రావాల్సిన నిధులను అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. సోమవారం సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ లాంటి అంతర్జాతీయ నగరానికి అంతర్జాతీయ ప్రమాణాలతో రవాణా సౌకర్యాలు ఉండాలనే ఉద్దేశంతో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో ప్రణాళికలు రూపొందించిందని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్ర ప్రగతి కోసం నిరంతరం శ్రమిస్తుంటే, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాత్రం ప్రతి పనికీ అడ్డంగా నిలుస్తున్నారని మండిపడ్డారు. ..మిగతా 2లో

## తెలంగాణలో నిలిచిపోయిన రవాణా సేవలు..

- 'వాహన్ సారథి' సాఫ్ట్‌వేర్ మొరాయింపు!
- రాష్ట్రవ్యాప్తంగా స్తంభించిన వాహనాల రిజిస్ట్రేషన్లు

2 VAHAN SARATHI

# చెట్లు కొట్టొద్దు.. మీరు నాటొద్దు!

## అటవీ వర్సెస్ విద్యుత్ శాఖల మధ్య హరిత యుద్ధం

- వర్షాకాలం వేళ ఇరుశాఖల బాహాబాహీ
- కొమ్మల నరికివేతపై అటవీశాఖ అభ్యంతరం
- హరితహారం చెట్లను పీకేస్తున్న విద్యుత్‌శాఖ
- లైన్ల మరమ్మతులపై అధికారుల మధ్య ఘర్షణ
- కిందిస్థాయి సిబ్బందిపై రెవెన్యూ చలాన్లు
- ఇరుశాఖల మధ్య కొరవడిన కనీస సమన్వయం



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
వర్షాకాలం ప్రారంభం అవుతుందంటే చాలు.. తెలంగాణవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట అటవీశాఖకు, విద్యుత్ శాఖకు మధ్య బాహాబాహీ నడుస్తూనే ఉంటుంది. ఇందుకు ప్రధాన కారణం ప్రతియేటా వర్షాలకు ముందు విద్యుత్ ఫీడర్లలో కొమ్మలు నరికే కార్యక్రమమే. తెలంగాణలోని టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో లక్షలాది కిలోమీటర్ల మేర 11 కేవీ, 33 కేవీ లైన్లు విస్తరించి ఉన్నాయి. వీటి ద్వారానే సబ్‌స్టేషన్ల నుండి ట్రాన్స్‌ఫార్మర్లకు, అక్కడి నుండి ఇళ్లకు విద్యుత్ సరఫరా జరుగుతుంది. అయితే ఈ లైన్ల కింద ఉన్న చెట్లు ఏపుగా పెరిగి వైర్లకు తగలడం వల్ల తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలో జూన్ నుండి ఆగస్టు మధ్యకాలంలో విద్యుత్ శాఖ కొమ్మలను తొలగిస్తుండటం, దానికి అటవీశాఖ అధికారులు అభ్యంతరం ..మిగతా 2లో

## ఇక ప్రజల్లోనే ఉండాలి!

### వినియోగదారుల సేవల కోసమే అధికారులు పనిచేయాలి



2

- వర్షాల వేళ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి
- విద్యుత్ పునరుద్ధరణలో సిబ్బంది భద్రత ముఖ్యం
- గాలివానలప్పుడు కరెంట్ స్తంభాలకు దూరంగా ఉండండి
- విద్యుత్ అధికారులకు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ ఆదేశం
- లాల్‌బజార్, మేడ్చల్ సర్కిళ్లలో ఆకస్మిక తనిఖీలు
- మూడు రోజులుగా కొనసాగుతున్న సీఎండీ పర్యటనలు

## సింగరేణిని ప్రైవేటీకరణ చేసే కుట్రలు

- ఓపెన్ కాస్టుల విస్తరణతో సంస్థకు నష్టం
- సింగరేణి బకాయిలు రూ.50వేల కోట్లు చెల్లించాలి
- కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్‌తో కలసి పోరాటం
- బొగ్గు బాయి బాట కార్యక్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత



3

## డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

- తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్
- రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం
- మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు
- ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు



2

## ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షక పాత్ర

- మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల
- జొన్న, మొక్కజొన్నలను ఎంఎస్పీ పరిధిలోకి తేవాలి



3



3

## మెట్రోకు అనుమతులు రాకపోవడానికి రేవంత్ కారణం

- ఓటుకు నోటు కేసు వల్లనే కేంద్రాన్ని ప్రశ్నించడంలేదు
- మెట్రోరైల్ పూర్తిచేసిన ఘనత కేసీఆర్‌దే
- కేసీఆర్ చొరవతో 72% పనులు పూర్తి
- కేంద్రంలో బీజేపీని అనలేక బీఆర్ఎస్‌పై విమర్శలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## ముగ్గురి ప్రాణాలు తీసిన ఫొటోషూట్ సరదా

చెరువులో పడి ముగ్గురు స్నేహితుల మృతి



2

# మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర సంపద

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహార పథకం
- కేజీబీవీ బాలికల మధ్య భట్టి బర్త్ డే వేడుకలు
- భట్టి నిరాడంబరతకు ఇదే నిలువెత్తు రూపం: మంత్రి పొన్నం
- కస్తూర్బా విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన భట్టి, పొన్నం
- గవర్నర్, సీఎం, మంత్రులు, ప్రముఖుల శుభాకాంక్షలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన జన్మదిన వేడుకలను అత్యంత ఆత్మీయ వాతావరణంలో విద్యార్థుల మధ్య సోమవారం జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) ఆయన సందర్శించారు



3

# తెలంగాణలో నిలిచిపోయిన రవాణా సేవలు..

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణవ్యాప్తంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో జరగాల్సిన వాహన రిజిస్ట్రేషన్లు, ఇతర సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'వాహన్ సారథి' యాప్ సర్వర్ డౌన్ కావడంతో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ లావాదేవీలు నిలిచిపోయాయి. గత రెండు రోజులుగా వరుసగా సెలవులు ఉండటంతో, సోమవారం ఉదయాన్నే వేలాది మంది ప్రజలు వివిధ రవాణా సేవల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే కార్యాలయాలు తెరిచినప్పటి నుంచే సాంకేతిక లోపం తలెత్తడంతో, సాఫ్ట్‌వేర్ ఓపెన్ కాక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**కార్యాలయాల వద్ద పడిగాపులు**

గతంలో కొత్త యాప్ వచ్చినప్పుడు చిన్నపాటి సమస్యలు తలెత్తినా అధికారులు వెంటనే పరిష్కరించేవారు. కానీ సోమవారం ఒక్క నిమిషం కూడా సేవలు నడవకపోవడంతో రవాణా కార్యాలయాలన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. దీనికి తోడు రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో, సుదూర ప్రాంతాల నుండి పనుల కోసం వచ్చిన ప్రజలు, వాహనదారులు గంటల తరబడి నిల్చోలేక తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

**శాశ్వత పరిష్కారం చూపాలి**

రవాణా శాఖ సేవల్లో తరచూ ఇలాంటి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని, దీనికి ఐటీ విభాగం శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. పనులు కాకపోవడం వల్ల తాము పదే పదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కొత్త సాఫ్ట్‌వేర్‌పై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన లోపించడం వల్లే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని సాఫ్ట్‌వేర్ రూపకర్తలు చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ, సర్వర్ మొరాయింపు కారణంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రవాణా సేవలు స్తంభించి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# తెలంగాణవ్యాప్తంగా రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్..

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యల హెచ్చరిక
- విద్యార్థుల భద్రత యాజమాన్యాలదే పూర్తి బాధ్యత
- పిల్లల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్తపడాలని విజ్ఞప్తి

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

రాష్ట్రంలో పాఠశాలలు మరియు విద్యాసంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రవాణా శాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) చేపట్టింది. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 245 విద్యాసంస్థల వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు, కనీస ఫిట్‌నెస్ లేని 60 బస్సులను అధికారులు తక్షణమే సీజ్ చేశారు. రాబోయే రోజుల్లోనూ ఈ స్పెషల్ డ్రైవ్ ఉధృతంగా కొనసాగుతుందని రవాణా శాఖ స్పష్టం చేసింది.

**యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు**

కనీస ఫిట్‌నెస్ లేకుండా నడిచే వాహనాలు, ఓవర్‌లోడ్ చేస్తున్న బస్సులను ఎలాంటి మినహాయింపు లేకుండా వెంటనే సీజ్ చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. మోటార్ వాహన చట్టం ప్రకారం వాహన యజమానులు, డ్రైవర్లతో పాటు సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల రవాణా, భద్రతా ప్రమాణాల అమలుకు పూర్తిబాధ్యత ఆయా పాఠశాల/కళాశాల యాజమాన్యాలదేనని తేల్చి చెప్పారు.

**తల్లిదండ్రులకు ప్రత్యేక విజ్ఞప్తి**

విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రయాణ భద్రతపై అప్రమత్తంగా ఉండాలని రవాణా శాఖ సూచించింది. ఓవర్‌లోడ్ వాహనాలలో పిల్లలను పాఠశాలలకు పంపవద్దని కోరింది. ఫిట్‌నెస్ లేని వాహనాలను తనిఖీల్లో సీజ్ చేసినప్పుడు విద్యార్థులు రోడ్డుపై మధ్యలోనే ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని, అందుకే పిల్లలు ప్రయాణించే బస్సుల ఫిట్‌నెస్, అనుమతులపై తల్లిదండ్రులు ముందే నిర్ధారించుకోవాలని విజ్ఞప్తి చేసింది. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 25,987 విద్యాసంస్థల బస్సులుండగా, ఇప్పటి వరకు 23,204 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందాయి. మిగిలిన 2,783 బస్సులు కూడా ఆలస్యం చేయకుండా వెంటనే ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరుపరచాలని రవాణా శాఖ గట్టిగా ఆదేశించింది.

# డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

- తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్
- రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం
- మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు
- ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- డిప్యూటి సీఎం భట్టి సూచనలు

**హైదరాబాద్, జూన్ 15:**

రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని, మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వెల్లడించారు. సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సోమవారం సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచనలు చేశారని తెలిపారు. ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు వస్తాయని వివరించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ ఉన్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై మార్గనిర్దేశర చేయాలని నిర్ణయించామని అన్నారు. డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క మార్గనిర్దేశం చేశారు. వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రైతులకు నష్టాలు రాకుండా మార్కెట్ అవసరాలకనుగుణంగా పంటల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రైతులకు లాభదాయకమైన, ఎగుమతి అవకాశాలు ఉన్న వంగడాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై నిరంతర సమీక్షా సమావేశాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్రాన్ని అధిక విలువ కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. రైతు ఆదాయం పెంపు, మార్కెట్ అనుసంధానానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామన్నారు. రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా మార్కెట్ డిమాండ్ ఆధారిత వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని భట్టి సూచించారు.

# ఇక ప్రజల్లోనే ఉండాలి!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

విద్యుత్ శాఖలో సిబ్బందైనా అధికారులైనా ప్రజల మధ్య ఉండాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితే వి పాటిల్ పేర్కొన్నారు. సోమవారం సికింద్రాబాద్ సర్కిల్ లోని లాల్ బజార్,మేడ్చల్ సర్కిల్ లను ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సర్కిల్ల పరిధిలోని అందరం ఇక ప్రజల్లో ఉండాల్సిన సమయమిది. వర్షాకాలం వస్తే విద్యుత్ శాఖకు ఎన్ని సమస్యలు వస్తాయో అందరికి తెలుసు వాటిని పరిష్కరించి ప్రజకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్షంగా పనిచేద్దామని అని అయన అధికారులకు సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం మనం క్షేత్ర స్థాయిలోనే ఉండాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మనం ప్రజలకు సేవలందించాలని అయన సూచించారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ తో విస్తరించిన పట్టణాల్లో వర్షం వచ్చినపుడు ఏర్పడే అంతరాయాలను తక్కువ సమయంలో తొలగించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కాలనీలు, గల్లీల్లో ఉండే పరిస్థితులకు అనుకూలంగా సిబ్బంది సమస్య తొలగించే దిశగా పనిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా వివరాలను మేము పర్యవేక్షిస్తూనే ఉంటాం. ఏదైనా ఇబ్బందులుంటే మమ్మలి సంప్రదించండి. కానీ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు.

**భద్రతపై సూచనలు**

విద్యుత్ అంతరాయాలు ఏర్పడినపుడు వాటిని తొలగించి పునరుద్ధరణ చేయడం ఎంత ముఖ్యమో పనిచేసే సిబ్బంది భద్రత పరమైన జాగ్రత్తలు తీసుకోవడం అంతే ముఖ్యమన్నారు. ఎన్ని సూచనలు చేసిన కొన్ని సార్లు చేస్తున్న నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు.మన భద్రత చూసుకుంటు ప్రజలకు అవాంతరాలు లేకుండా చూద్దామని ఆయన సిబ్బంది ఉద్దేశించి అన్నారు.

**ప్రజలు సహకరించాలి**

వర్షాకాలంలో విద్యుత్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ కోరారు. అన్ని ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి వర్షం పడుతున్నప్పుడు కరెంట్ పోల్స్ కు దూరంగా ఉండండి. ఎక్కడైనా చెట్లు కూలితే సమాచారం ఇవ్వండి. ప్రజలు జాగ్రత్తలు తీసుకునే ప్రమాదాలకు దూరంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు.

**గత మూడు రోజులుగా పర్యటనల్లోనే**

టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ తో సహా పలువురు డైరెక్టర్లు గత మూడు రోజులుగా ఆకస్మిక పర్యటనల్లో ఉన్నారు. గత శనివారం అర్ధరాత్రి నుండి మొదలైన ఆకస్మిక తనిఖీలు వర్షాకాలం పూర్తయేవరకు కొనసాగే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు సబ్ స్టేషన్ లను సర్కిల్ కేంద్రాలను ఇటీవల తరచూ తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే ప్రజలకు దగ్గరగా ఉండాలని సీఎండీ పిలుపులివ్వడం ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటిస్తుండంతో జిల్లాల అధికారులు అప్రమత్తమయ్యారు. ఎప్పుడు ఎవరు ఎలా తనిఖీ చేస్తారో అన్న పరిస్థితి ఉండటంతో అధికారులు విద్యుత్ పునరుద్ధరణలో సిబ్బంది ఎంత మేర పనిచేస్తున్నారన్న విషయంపై ఎప్పటికప్పుడు అరా తీస్తున్నారు. ఏది ఏమైనా సీఎండీ పనితీరుతో ప్రజల్లో క్షేత్ర స్థాయి సిబ్బందికి సైతం మంచి పేరు వచ్చే అవకాశం కనపడుతోంది.

# చెట్లు కొట్టొద్దు.. మీరు నాటొద్దు!

**మొదటి పేజీ తరువాయి**

తెలపడంతో ఇరు శాఖల మధ్య పెద్ద ఎత్తున వాగ్వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏటా కొత్త ఫీడర్లు పెరుగుతుండటంతో ఈ సమస్య కాస్తా కోర్టులు, కేసుల వరకు వెళ్తోంది.

**కోట్లు ఖర్చు పెట్టిన చెట్లను కొడతారా?**

గత పదేళ్లుగా హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం కోట్లాది మొక్కలు నాటింది. అటవీశాఖ ఆధ్వర్యంలో రిజర్వ్ ఫారెస్ట్‌లతో పాటు గ్రామీణ, రాష్ట్రీయ, జాతీయ రహదారులకు ఇరువైపులా చెట్లను పెంచి పోషించడానికి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. అయితే ప్రస్తుతం దట్టంగా పెరిగిన ఈ వృక్షాల పైభాగంలో విద్యుత్ లైన్లు ఉండటంతో కొమ్మలు వైర్లకు తగులుతున్నాయి. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం వల్ల చెట్లు ఎక్కడ నాటినా అవి విద్యుత్ లైన్ల మధ్యలోకి వెళ్లక తప్పడం లేదు. ప్రభుత్వం ఎంతో కష్టపడి పర్యావరణాన్ని కాపాడాలని చెట్లను పెంచుతుంటే.. విద్యుత్ శాఖ కనీసం తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అడ్డగోలుగా నరుకుతోందని అటవీశాఖ ఆరోపిస్తోంది. కొన్నిచోట్ల ఏకంగా జేసీబీలు తెచ్చి చెట్లను కూకటివేళ్లతో పీకేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే చిన్నపాటి యుద్ధానికే దిగుతున్నారని అటవీ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కరెంట్ రావాలంటే కొమ్మలు కొట్టాల్సిందే..**

మరోవైపు విద్యుత్ శాఖ వాదన వేరేలా ఉంది. వర్షాకాలంలో గాలివానల వల్ల కొమ్మలు విరిగి లైన్లపై పడితే వైర్లు తెగిపోవడమే కాకుండా పోల్స్ విరిగిపడే ప్రమాదం ఉంది. దీనివల్ల గంటల తరబడి కరెంట్ సరఫరా నిలిచిపోతుంది. సమయం ఆదా అవుతుందని, ఎలాగూ ఏటా కొమ్మలు కొట్టే బాధ తప్పుతుందనే అనాలోచిత ఆలోచనతో కొందరు కిందిస్థాయి విద్యుత్ అధికారులు ఏకంగా జేసీబీలతో చెట్లను పీకేస్తుండటం ఇప్పుడు పెద్ద రాద్ధాంతానికి దారితీస్తోంది.

**జిల్లాల్లో క్షేత్రస్థాయి ఘర్షణలు**

వారం రోజుల క్రితం నల్గొండ జిల్లా ముకుందాపురం వద్ద ఎన్‌హెచ్ 167 జాతీయ రహదారిపై ఏకంగా పెద్ద పెద్ద చెట్లను కొందరు రైతులు జేసీబీతో తొలగించారు. దీనిపై విచారించగా.. తమకు కరెంట్ కనెక్షన్ ఇవ్వాలంటే లైన్ మధ్యలో ఉన్న చెట్లను తొలగించాలని విద్యుత్ అధికారులు చెప్పడంతోనే అలా చేశామని రైతులు తెలిపారు. అలాగే రెండ్రోజుల క్రితం మెదక్‌లో చెట్ల కొమ్మలు నరుకుతుండగా అడ్డుకున్నందుకు అటవీ అధికారులకు, విద్యుత్ అధికారులకు మధ్య పెద్ద గొడవ జరిగి కేసుల దాకా వెళ్లింది. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే.. ప్రస్తుతం ప్రతి జిల్లాలోనూ రోజుకో చోట ఇలాంటి ఘర్షణ వాతావరణమే కనిపిస్తోంది.

**చలాన్లు కట్టలేక కిందిస్థాయి అధికారుల ఇబ్బందులు**

చెట్ల కొమ్మలు నరకడం వల్ల అటు అటవీశాఖతోనే కాకుండా ఇటు రెవెన్యూ శాఖతోనూ విద్యుత్ సిబ్బందికి సమస్యలు వస్తున్నాయి. ప్రధాన రహదారులు, మండల కేంద్రాల గుండా వెళ్తున్న రోడ్లపై చెట్లు నరికితే స్థానిక రెవెన్యూ అధికారులు వేల రూపాయల చలాన్లు విధిస్తున్నారు. వృక్షాల సంరక్షణ చట్టం ప్రకారం ఒక్క కొమ్మ నరకాలన్నా అనుమతి తీసుకోవాల్సిందే. కానీ అత్యవసర సేవల కింద విద్యుత్ అధికారులు పనులు ముగించేస్తున్నారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖ వేసే చలాన్లను ఆయా సబ్ ఇంజనీర్ లేదా అసిస్టెంట్ ఇంజనీర్లనే బాధ్యులను చేస్తూ వారి సొంత జేబుల నుండి కట్టించుకుంటుండటంతో కిందిస్థాయి సిబ్బంది తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

**సమన్వయ లోపమే అసలు సమస్య!**

ఉభయ శాఖల అధికారుల మధ్య కనీస సమన్వయం లేకపోవడమే ఈ వివాదాలన్నింటికీ మూలకారణం. కరెంట్ వైర్ల కింద చెట్లను పెంచడం, ఆ తర్వాత కొమ్మలను కొట్టొద్దని మొండిగా వాదించడం ఎంతవరకు సమంజసమని విద్యుత్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వంలో భాగమైన రెండు శాఖలు ఒకరినొకరు సంప్రదించుకోకుండా, చట్టాలను అడ్డుపెట్టుకుని చలాన్లు, కేసులు అంటూ గొడవ పడటం వల్ల ప్రభుత్వ ప్రతిష్టే దెబ్బతింటోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి, వర్షాకాలానికి ముందే ఇరు శాఖల అధికారులతో ఉమ్మడి సమావేశాలు ఏర్పాటు చేసి, సమన్వయంతో కొమ్మల తొలగింపు ప్రక్రియ జరిగేలా శాశ్వత మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మెట్రో ఫేజ్ 2 పూర్తి చేయడమే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**

కేసీఆర్ చర్యలతోనే మెట్రో ఆలస్యం గత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆనాటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్ రెడ్డి చొరవతో హైదరాబాద్‌కు మెట్రో ప్రాజెక్టు వచ్చిందని సీఎం తెలిపారు. వైఎస్ఆర్ మరణానంతరం రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మొదటి దశ మెట్రో కోసం ఒప్పందాలు జరిగాయన్నారు. 2017 నాటికే మెట్రో మొదటి దశ పూర్తి కావాల్సి ఉండగా, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ సర్కార్ చారిత్రక కట్టడాల సాకుతో ప్రాజెక్టును అడ్డుకుందని ఆరోపించారు. కేసీఆర్ అనాలోచిత చర్యల వల్ల మెట్రో మొదటి దశ మూడేళ్లు ఆలస్యం కావడమే కాకుండా, రూ. 15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు వ్యయం రూ. 22 వేల కోట్లకు చేరిందన్నారు. ఈ ఆలస్యం, కోవిడ్ ప్రభావం వల్ల ఎల్ అండ్ టీ సంస్థ భారీ నష్టాల్లో కూరుకుపోయిందని, ఆ తర్వాత గత ప్రభుత్వం పదేళ్ల పాటు మెట్రో విస్తరణను పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు.

**ఎల్ అండ్ టీ మెట్రో స్వాధీనం**

గత ప్రభుత్వం కేవలం తమ ఆస్తులు పెంచుకోవడానికే చూసింది తప్ప ప్రజల రవాణా సౌకర్యాల గురించి ఆలోచించలేదని, అందుకే హైదరాబాద్ మెట్రో దేశంలోనే 9వ స్థానానికి పడిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. తమ ప్రజా ప్రభుత్వం రాగానే మెట్రో విస్తరణ చేపట్టాలని నిర్ణయించి, ఫేజ్ 2 నిధుల కోసం ప్రధానితో పాటు కేంద్ర మంత్రులను కలిశామన్నారు. అయితే, ఫేజ్ 1 నిర్మించిన ఎల్ అండ్ టీ సంస్థతోనే ఫేజ్ 2 కట్టించాలని కేంద్రం నిబంధన పెట్టిందని, కానీ పాత నష్టాల వల్ల తాము ఈ ప్రాజెక్టు చేపట్టలేమని ఎల్ అండ్ టీ స్పష్టం చేసిందన్నారు. దీంతో కేంద్రం సూచన మేరకు రూ. 30 వేల కోట్ల విలువైన ఎల్ అండ్... టీ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. 15 వేల కోట్లకు కొనుగోలు చేసిందని వెల్లడించారు. ఎల్ అండ్ టీ మెట్రోపై బ్యాంకుల్లో ఉన్న రూ. 13,600 కోట్ల రుణాన్ని (8.25 శాతం వడ్డీ) రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కోరామన్నారు. ఇందుకోసం ఐఆర్ఎఫ్‌సీ ద్వారా జపాన్ సంస్థ నుండి కేవలం 4 శాతం వడ్డీకే రూ. 13,600 కోట్ల రుణం తీసుకొచ్చామని, గతంలో కేసీఆర్ ప్రభుత్వం పీఎఫ్‌సీ, ఆర్ఈసీల ద్వారా ఎలాంటి గ్యారెంటీ లేకుండా 9 నుండి 11.5 శాతం భారీ వడ్డీకి రూ. 3.15 లక్షల కోట్లు అప్పు తెచ్చిందని గుర్తుచేశారు.

**కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు**

జపాన్ సంస్థ ఇప్పటికే ఐఆర్ఎఫ్‌సీకి నిధులు విడుదల చేసిందని, ఆ రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయడానికి తాము రూ. 1400 కోట్లు కూడా చెల్లించామని సీఎం తెలిపారు. ఇక రుణం బదిలీ అవుతుందనుకున్న తరుణంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రంగంలోకి దిగి అడ్డుకున్నారని ఆరోపించారు. మే 20న కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను, మే 21న అశ్విని వైష్ణవ్‌ను కలిసి తెలంగాణకు లోన్ బదిలీ చేయవద్దని కిషన్ రెడ్డి చెప్పారని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. జపాన్ నిధులు విడుదల చేసినా ఐఆర్ఎఫ్‌సీ ఎందుకు బదిలీ చేయడం లేదని, ఆ డబ్బుకు వడ్డీ ఎవరు కట్టాలో కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రిజర్వ్ బ్యాంక్‌ను ఒప్పించిన లెటర్ ఇచ్చినప్పటికీ లోన్ ట్రాన్స్‌ఫర్ కాకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.

**కేంద్రం వద్దనుకుంటే ఎన్‌ఓసీ ఇవ్వండి**

'మీరు సికింద్రాబాద్ ఎంపీగా ఉన్నారు.. నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్న ప్రాంతంలోనే ఈ మెట్రో విస్తరణ జరగాల్సి ఉంది. మరి దీనిపై మీకెందుకు బాధ్యత లేదు?' అని కిషన్ రెడ్డిని సీఎం ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి కష్టంగా ఉంటే 50 శాతం భాగస్వామ్యం కూడా వద్దని, కేవలం ఎన్‌ఓసీ ఇస్తే పూర్తి ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వమే భరించి 122 కిలోమీటర్ల మెట్రో రెండో దశను నిర్మించుకుంటుందని స్పష్టం చేశారు. గతంలో కేసీఆర్ 'రండ' అని మాట్లాడినా కిషన్ రెడ్డి పల్లెత్తు మాట అనలేదని, తాము గౌరవంగా అడుగుతున్నా సవాళ్లు విసురుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి వెనుక కేటీఆర్ ఉన్నారని, కేటీఆర్ చేసే కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు.

# ముగ్గురి ప్రాణాలు తీసిన ఫొటోషూట్ సరదా

**మేడ్చల్, జూన్ 15 సిరి న్యూస్:**

మేడ్చల్ జిల్లా కీసర పోలీసు స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్ కోసం ఫొటోషూట్‌కు వచ్చిన ముగ్గురు యువకులు చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ధర్మారం గ్రామంలోని బాణమ్మ చెరువు వద్ద సరదాగా ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు వచ్చిన ఆంటోనీ (18), జోసెఫ్ (18), టోనీ (17) ప్రమాదానికి గురయ్యారు. ఫొటోషూట్ సందర్భంగా నీటిలో పడిపోయిన హెడ్‌ఫోన్స్ తీసుకోవడానికి చెరువులోకి దిగిన యువకులు ప్రమాదవశాత్తూ నీటిలో గల్లంతయ్యారు. మృతులు బొల్లారం ప్రాంతానికి చెందిన స్నేహితులుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మరో యువకుడి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సరదాగా వెళ్లిన ముగ్గురు స్నేహితులు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేటప్పుడు యువత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# బడికి 'అమావాస్య' ఎఫెక్ట్!

- ప్రజా సెంటిమెంట్‌ను పట్టించుకోని సర్కార్
- మహబూబాబాద్ జిల్లాలో బిల్లులు చెల్లించలేదని పాఠశాలకు తాళం వేసిన కాంట్రాక్టర్

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**



తెలంగాణవ్యాప్తంగా సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. అయితే, తొలిరోజే బడులు పూర్తిగా వెలవెలబోయాయి. సోమవారం 'అమావాస్య' కావడంతో ఆ సెంటిమెంట్ ప్రభావం విద్యార్థుల హాజరుపై తీవ్రంగా పడింది. కొత్త విద్యాసంవత్సరం మొదటి రోజే అమావాస్య రావడం మంచిది కాదనే నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపలేదు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఎంతలా అంటే, పలు పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల సంఖ్యకు సమానంగానే విద్యార్థులు హాజరు కావడం గమనార్హం. రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో మొత్తం 45 వేలకు పైగా పాఠశాలలు, దాదాపు 65 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. సాధారణంగా తొలిరోజు హాజరు కొంత తక్కువగానే ఉన్నప్పటికీ, ఈసారి అమావాస్య సెంటిమెంట్ వల్ల హాజరు శాతం మరీ ఘోరంగా పడిపోయింది. జూన్ 15న అమావాస్య ఉన్నందున బడుల ప్రారంభ తేదీని మార్చాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేసినా విద్యాశాఖ పట్టించుకోలేదు. ప్రభుత్వం తమ సెంటిమెంట్‌ను గౌరవించకపోవడంతో, తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపకుండానే తమ అసంతృప్తిని చాటారు.

**బిల్లులు చెల్లించలేదని పాఠశాలకు తాళం!**

పాఠశాల భవనం నిర్మించి నాలుగేళ్లు గడుస్తున్నా బిల్లు చెల్లించడం లేదంటు పాఠశాల ప్రారంభమైన మెదటి రోజే స్కూల్ కు తాళం వేసి నిరసన తెలిపాడో కాంట్రాక్టర్. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పెరుమాళ్ళ గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం రామకృష్ణ అనే కాంట్రాక్టర్ 40 లక్షల టెండర్ దక్కించుకున్నారు. పనులు పూర్తి చేసి నాలుగేళ్లయింది. ఐతే తనకు ఇప్పటివరకు 7 లక్షల రూపాయలు చెల్లించారని వాపోయారు. మన ఊరు మనబడి ద్వారా పనులు చేసానని బిల్లుల కోసం తిరిగితే పట్టించుకోవడం లేదని అందుకే పాఠశాలకు తాళం వేశానని అయన తెలిపారు. మొదటి రోజే తాళం వేయడంతో పాఠశాల ఉపాధ్యాయులు బయటే ఉండాల్సి వచ్చింది. ఇక కొందరే విద్యార్థులు రావడం తాళం ఉండటంతో వాళ్ళు వెనుతిరగడం ఇక్కడ కొసమెరుపు.

# 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షా లు

- నిరంతరం అప్రమత్తత అవసరం
- విపత్తుల నిర్వహణ యంత్రాంగం సిద్ధంగా ఉండాలి
- రెవెన్యూ, విపతుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ జూన్ 15 సిరి న్యూస్ :**



నైరుతి రుతుపవనాలు రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో రాష్ట్రం అంతటా విస్తరించే అవకాశం ఉందని, ముఖ్యంగా ఈ నెల 19నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ఊపందుకుని వారం రోజులపాటు కొనసాగవచ్చని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా ముందస్తుగానే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంచాలని మంత్రి సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాలను అప్రమత్తం చేస్తూ అధికారులతో మంత్రి సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 8న దక్షిణ తెలంగాణలోకి ప్రవేశించి జోగులాంబ గద్వాల జిల్లాను ఆవరించగా ప్రస్తుతం హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా ఉత్తర సరిహద్దు కొనసాగుతోందన్నారు. 14వ తేదీ నాటికి దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాలు, మధ్య తెలంగాణలోని చాలా జిల్లాలను రుతుపవనాలు తాకాయని తెలిపారు. రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా సుమారు 10 శాతం లోటు ఉందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బందితో నిరంతరం సమన్వయం కొనసాగించాలని మంత్రి స్పష్టం చేశారు. వర్షాల తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమంటూ ప్రభుత్వం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర సంపద

**హైదరాబాద్, జూన్ 15 సిరి న్యూస్:**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన జన్మదిన వేడుకలను అత్యంత ఆత్మీయ వాతావరణంలో విద్యార్థుల మధ్య సోమవారం జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) ఆయన సందర్శించారు. ప్రభుత్వ పాఠశాల బాలికల నవ్వుల మధ్య ఆయన తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవ డం అక్కడి వారిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డిప్యూటీ సీఎంలు విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం భావిస్తోందని స్పష్టం చేశారు. సోమవారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా 29 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార(బ్రేక్‌ఫాస్ట్) పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఇంటర్ చదువుతున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పిల్లలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన బోధనతోపాటు నాణ్యమైన యూనిఫామ్‌లు, షూస్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈనాటి విద్యార్థులే రేపటి మానవ వనరులు, రాష్ట్ర సంపద. వారి విద్య, ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకాడదన్నారు. పోషకాలతో కూడిన ఆహారం అందిస్తేనే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదిగి ఈ పోటీ ప్రపంచంలో రాణించగలరు అని భట్టి పేర్కొన్నారు. విద్యార్థుల అవస్థలను గమనించిన ప్రజా ప్రభుత్వం 40% డైట్ చార్జీలు, 200% కాస్మోటిక్ చార్జీలను పెంచిందని గుర్తు చేశారు. ఈ పాఠశాలలో అదనపు గదుల కోసం అంచనాలు పంపితే ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆర్థిక స్థోమత లేకపోయినా చదువుకోవాలనే బలమైన కోరిక ఉన్న బాలికల కోసమే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేజీబీవీలను తీసుకొచ్చాయని, దీనివల్ల బడి మానేసే బాలికల సంఖ్య చాలా తగ్గిందని గుర్తు చేశారు.

**నిరాడంబరతకు ఇదే నిదర్శనం: మంత్రి పొన్నం**

భట్టి విక్రమార్కపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశంసల జల్లు కురిపించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న పేద బాలికల మధ్యన జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం ఆయన నిరాడంబరతకు, సంస్కారానికి నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు. గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాలకు సంబంధించి పెండింగ్‌లో పెట్టిన డైట్, కాస్మెటిక్ బిల్లులను ఈ ప్రజా ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ద్వారా వెనువెంటనే విడుదల చేసిందని గుర్తు చేశారు. డైట్, కాస్మెటిక్ చార్జీలను భారీగా పెంచినందుకు కేజీబీవీ విద్యార్థినులు ప్రభుత్వానికి, ముఖ్యంగా డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే తమ చేతుల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పెట్టడం పట్ల విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తూ ఉప ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తమ మధ్య బర్త్‌డే జరుపుకోవడం ఎప్పటికీ మర్చిపోలేమని విద్యార్థినులు భావోద్వేగానికి లోనయ్యారు. స్థానిక కాంగ్రెస్ నేత భీమ్ భరత్ భట్టితో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అధ్యక్షత వహించగా ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే పీర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్లు చల్ల నరసింహారెడ్డి, అన్వేష్ రెడ్డి, కోట్నాక్ తిరుపతి, సిడబ్ల్యుసి సభ్యులు రుద్రరాజు, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.గవర్నర్, సీఎం, మంత్రులు, ప్రముఖుల శుభాకాంక్షలు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ప్రజాభవన్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. గవర్నర్ శివప్రతాప్ శుక్లా విక్రమార్కకు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రియ సోదరుడు భట్టి మల్లుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.. రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడంలో మనం కలిసి మరింత ఉత్తమ ఫలితాల కోసం కృషి చేద్దాం' అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిప్యూటీ సీఎంకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భగవంతుడు దీర్ఘాయుష్షును, ఆయురారోగ్యాలను, సుఖసంతోషాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. కాగా, ఉదయం నుంచే ప్రజాభవన్‌కు మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు, అధికారులు భారీగా తరలివచ్చారు. బొకేలు, శాలువాలతో సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, వాకిటి శ్రీహరి, అజహరుద్దీన్, సీడబ్ల్యూసీ సభ్యుడు రుద్రరాజు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, కొత్త ప్రభాకర్ రెడ్డి, బీఎలఆర్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు అన్వేష్ రెడ్డి, నరసింహారెడ్డి, పోదెం వీరయ్య, నాయుడు సత్యం, బండ్రు శోభారాణి, రాయల నాగేశ్వరరావు, శివసేనారెడ్డి, చరణ్ కౌశిక్, సరిత తిరుపతయ్య, బీసీ కమిషన్ మెంబర్ రాపోలు జయప్రకాష్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ స్నిగ్ధ పట్నాయక్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్‌కో సీఎండీ హరీష్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ తదితరులు ఉన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ భట్టి విక్రమార్కకి పుష్పగుచ్ఛం అందించి పట్టు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**ఆరు గ్యారంటీల థీమ్‌తో 120 కేజీల భారీ కేక్ కటింగ్**

మధిర నియోజకవర్గం బోనకల్ మండలం గోవిందపురం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు కొమ్మినేని రమేష్ బాబు ప్రత్యేకంగా 120 కేజీల భారీ కేకును తయారు చేయించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భట్టి విక్రమార్క చేపట్టిన చరిత్రాత్మక పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చిత్రాలతో ఈ కేకును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రజాభవన్‌లో భట్టి ఈ కేకును కట్ చేశారు.

## 'బాల్య వివాహం – బతుకు ఆగం'పై

# రాష్ట్రవ్యాప్త పోరు

- 'తరుణి'తో మహిళా శిశు సంక్షేమ శాఖ ఎంవోయూ

**హైదరాబాద్, జూన్ 15 సిరి న్యూస్ :**



రాష్ట్రంలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణలను అరికట్టేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కీలక అడుగు వేసింది. ఈ దిశగా బాలికల సాధికారత, బాల్య వివాహాల నిరోధం, మానవ అక్రమ రవాణా నిరోధం వంటి అంశాల్లో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న తరుణి స్వచ్ఛంద సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో ఈ ఒప్పంద పత్రాలపై సచివాలయంలో సోమవారం సంతకాలు జరిగాయి. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఒఝా, తరుణి ఫౌండర్స్ మమతా రఘువీర్, రఘువీర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాల్య వివాహం ఒక కుటుంబ సమస్య మాత్రమే కాదని, అది బాలికల భవిష్యత్తును ప్రభావితం చేసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. బాల్య వివాహాల కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు తలెత్తడం, ఆర్థిక స్వావలంబన దెబ్బతినడం వంటి అనేక ప్రతికూల ప్రభావాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. బాల్య వివాహంబతుకు ఆగం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా కేంద్రంగా ఈ ప్రచారం మరింత విస్తృతంగా జరగాలన్నారు. రాష్ట్రంలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల నివారణకు ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఇప్పుడు తరుణి వంటి అనుభవజ్ఞ సంస్థ సహకారంతో ఈ ప్రయత్నాలను మరింత విస్తృత స్థాయిలో తీసుకెళ్తామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాలికలకు వారి హక్కులు, ఆరోగ్యం, విద్య, భద్రతపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, సీడీపీవోలు, ఇతర శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణలు అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచార కార్యక్రమాల ద్వారా బాల్య వివాహాల దుష్పరిణామాలు, మైనర్ గర్భధారణల ప్రమాదాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలికల విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్న మంత్రి 'ప్రతి బాలిక తన కలలను సాకారం చేసుకునే వాతావరణం కల్పించడం మనందరి బాధ్యత.. బాల్య వివాహాలకు పూర్తిగా ముగింపు పలకడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి పనిచేయాలి' అని పిలుపునిచ్చారు. మమతా రఘువీర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల తగ్గింపునకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి సాంకేతిక సహకారం, అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# మెట్రోకు అనుమతులు రాకపోవడానికి రేవంత్ కారణం

**హైదరాబాద్, జూన్ 15 సిరి న్యూస్:**

తనపై వేలాడుతున్న ఓటుకు నోటు కేసు వల్లనే కేంద్రాన్ని ప్రశ్నించలేని అసమర్థతలో రేవంత్ రెడ్డి వున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రధానిని ప్రశ్నించలేని అసమర్థుడు రేవంత్ రెడ్డి ప్రతిపక్షంపై నిందలు వేసే నీచ ప్రయత్నం చేస్తున్నాడన్నారు. మెట్రో రెండో దశను సాధించడంలో అట్టర్ ఫ్లాప్ అయినందుకు, మొదటి దశను ఆగం చేస్తున్నందుకు సీఎం వెంటనే ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్ పూర్తి చేసిన ఘనత ముమ్మాటికి కేసిఆర్ దేనన్నారు. 28 శాతం మెట్రో పనులు కూడా పూర్తి చేయకుండా ప్రాజెక్టును చిక్కుల్లో వదిలేసిన నాటి కాంగ్రెస్ 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కేసీఆర్ చొరవ తీసుకుని 72 శాతం పనులను పూర్తి చేశారన్నారు. కేవలం తన స్వార్థ ప్రయోజనాలకోసం ఉనికిలో లేని ఊహా నగరానికి మెట్రో రెండో దశను రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. కానీ గత ప్రభుత్వం ట్రాఫిక్ రద్దీ, నగర విస్తరణ, ప్రజల రోజువారి అవసరాల కోసం మెట్రో రెండో దశను ప్రతిపాదించిందని గుర్తుచేశారు. 71 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినప్పటికీ తన 'బడేభాయ్'ని మెప్పించి ప్రాజెక్టును ఒప్పించలేకపోవడం రేవంత్ రెడ్డి చేతకానితనానికి, దద్దమ్మ పాలనకు నిలువెత్తు నిదర్శనమన్నారు. రేవంత్ రెడ్డి తన అసమర్థతను దాచుకోవడానికి అనేక అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. యూపీ, అహ్మదాబాద్, వైజాగ్ వంటి నగరాలకు కేంద్రం మెట్రోలను మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తీసుకురాలేకపోయారో ముందుగా ప్రజలకు జవాబు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనం మెట్రో రెండవ దశకి అనుమతి దక్కకపోవడం అన్నారు. మెట్రో విస్తరణకు అనుమతి ఇవ్వని కేంద్రంపై ముఖ్యంగా ప్రధానమంత్రిని విమర్శించే సత్తా ధైర్యం రేవంత్ రెడ్డికి లేదన్నారు. బిజెపిని కాక ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ ని విమర్శించి ప్రజలను తప్పుదోవ పట్టించే నీచమైన ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారన్నారు. గతంలో కేసీఆర్ పాలనలో అనుమతులు, రుణాలు శరవేగంగా ఎలా వచ్చాయో, మీ దిక్కుమాలిన పాలనలో అవి ఎందుకు ఆగిపోయాయో ప్రజలకు అర్థమవుతోందన్నారు. బీఆర్ఎస్ పై, కేసీఆర్ పై పడి ఏడవడం తప్ప మీకు ఏ పని చేతకాదని నాలుగు కోట్ల తెలంగాణ సమాజానికి అర్థమైందన్నారు. కేంద్రం నుంచి నిధులు రాకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని చెప్పడం అంటే మోదీ కన్నా కేసీఆర్ పవర్ ఫుల్ అని పరోక్షంగా ఒప్పుకున్నట్లే కదా అని ఎద్దేవా చేశారు. కేంద్రం సహకరించకపోయినా రుణాలు సాధించి మెట్రోను పరుగులు పెట్టించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని స్పష్టం చేశారు.

## సింగరేణిని

# ప్రైవేట్‌పరం చేసే కుట్రలు

**మంచిర్యాల, జూన్ 15 సిరి న్యూస్:**

సింగరేణిని ప్రైవేట్‌పరం చేసే కుట్రలు జరుగుతున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. కొత్త బొగ్గు బావులు తెచ్చుకుంటే లక్షలాదిమందికి ఉద్యోగాలు వస్తాయని, మన హక్కైన డిపెండెంట్ ఉద్యోగాల కోసం రాజీ లేని పోరాటం చేయాల్సి ఉందన్నారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే వెంటనే సింగరేణికి బకాయి ఉన్న రూ.50 వేల కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేసి ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచుతూ సింగరేణి ఉనికిని దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన బొగ్గుబాయి కార్యక్రమంలో భాగంగా కాసిపేట మైన్ 1ను ఆమె సందర్శించారు. గనిలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడి వారి కష్టాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాసిపేట నుంచే వారం రోజుల పాటు సాగనున్న ఈ 'బాయి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన టిఆర్ఎస్ కు సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కావాలని కోరారు. వారసత్వ ఉద్యోగాల్లో సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని కవిత మండిపడ్డారు. సంస్థ పరిరక్షణ కోసమే టీఆర్ఎస్, హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. పాలసీలు రూపొందించాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలే అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ కార్మిక రంగాన్ని మభ్య పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మనం కలిసి పనిచేశాం. నేను ఎక్కడున్నా అనునిత్యం పక్కనే ఉండి పోరాడాను. గతంలో మెడికల్ బోర్డు కోసం సింగరేణి భవన్‌ను ముట్టడించిన చరిత్ర మనది. కానీ ఈ ప్రభుత్వంలో సర్వసాధారణంగా జరగాల్సిన పనుల కోసం కూడా కార్మికులు రోడ్డెక్కి పోరాడాల్సి వస్తోంది అంటూ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీ సమస్యలను తీర్చడంలో, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అన్నింటిలో ప్రైవేట్‌ను తీసుకొచ్చి వైద్యాన్ని ఖరీదు చేస్తున్నారని మండిపడ్డారు. అందుక. కార్మికుల రక్షణ కోసం, వారి కుటుంబాల సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన పాంచజన్యం అనే ఐదు కీలక అంశాలతో ముందుకు వచ్చిందని కవిత ప్రకటించారు.

# ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షక పాత్ర

- మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల
- జొన్న, మొక్కజొన్నలను ఎంఎస్పి పరిధిలోకి తేవాలి

**హైదరాబాద్, జూన్ 15 సిరి న్యూస్:**



రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు పక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస ధరలు వస్తాయని ఆశగా సాగు చేసిన రైతులకు న్యాయం జరగట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వ సౌకర్యాలు, గన్ని బ్యాగుల లభ్యత, రవాణా ఏర్పాట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా చర్చించారు. ఇప్పటికైనా సేకరించిన పంటలను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతోపాటు 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు. కేంద్రం కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.4,000 కోట్లతో మొక్కజొన్న సేకరణ చేపట్టిందన్నారు. జొన్న కొనుగోలుకు రూ.1100 కోట్లతో ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొక్కజొన్న, జొన్నలను వెంటనే పీఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. పిఎస్ఎస్ స్కీంలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటలపై 25శాతం సీలింగ్ పరిమితిని 50 శాతంకు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బంది పడుతున్న కేంద్రం నుంచి ఎటువంటి సమాధానం లేదని విమర్శించిన మంత్రి తుమ్మల రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రైతుల నుండి 9.57 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం స్వంత నిధులతో రూ.4,000 కోట్ల వ్యయంతో మొక్కజొన్న కొనుగోలు చేపట్టిందన్నారు. జొన్న పంటను కూడా రూ.1,000 కోట్లతో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. సేకరించిన మొక్కజొన్న నిల్వ కోసం మొత్తం 15.07 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు అవసరమవుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11.40 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే అందుబాటులో ఉందని, దీంతో ఇంకా 3.29 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యం అత్యవసరంగా అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు అదనపు గోదాములను వెంటనే గుర్తించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం మొత్తం 3 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమవుతుండగా, ఇప్పటివరకు 2 కోట్ల గన్ని బ్యాగులు సరఫరా చేసినట్లు తెలిపారు. మిగిలిన కోటి గన్ని బ్యాగులు వెంటనే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అప్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల కొరత లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన పంటను ఆలస్యం లేకుండా బరువు తూచి, గోదాములకు తరలించేందుకు తగిన సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి గోదాములకు పంట తరలింపులో ఆటంకాలు లేకుండా సమన్వయంతో పనిచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు సూచించారు. మొక్కజొన్న, జొన్న పంటలను కేంద్ర ప్రభుత్వ ధర మద్దతు పథకం పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు స్పందన రాలేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం పీఎస్ఎస్ పరిధిలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలుపై అమలులో ఉన్న 25 శాతం సీలింగ్‌ను వెంటనే 50 శాతానికి పెంచాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ మంత్రికి మరోసారి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు రాష్ట్ర రైతుల సమస్యలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి, శనగ, పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితిని 50 శాతానికి పెంచించడంతో పాటు, మొక్కజొన్న, జొన్నలను పీఎస్ఎస్‌లో చేర్చేలా కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆ బాధ్యతల నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుని పనిచేస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమమే పరమావధిగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు పక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.

# ఆర్ డి ఓ ను సన్మానించిన వ్యవసాయ అధికారి

**తూప్రాన్ జూన్ 15 సిరి న్యూస్**



తూప్రాన్ మండల రెవెన్యూ సబ్ డివిజనల్ అధికారి నూతన ఆర్ డి ఓ గా బాధ్యతలు చేపట్టిన బావయ్యను సోమవారం ఆర్ డి ఓ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన మండల వ్యవసాయ అధికారి గంగుమల్లు శాలువాతో సన్మానించారు ఆర్ డి ఓ బావయ్య మాట్లాడుతూ మండలంలోని రైతులకు రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తేవాలని వ్యవసాయ అధికారికి సూచించారు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలకు రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ పరమైన వీలైనటువంటి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆర్ డి ఓ బావయ్య తెలిపారు. ఎం ఏ ఓ గంగుమల్లు మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతుకు కౌలు రైతుకు యూరియా అందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రతి ఒక్క రైతుకు యూరియా నాణ్యమైన విత్తనాలు వ్యవసాయ రంగానికి కావలసిన విత్తనాలు మందులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఫార్మా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండలంలోని మూడు గ్రామాలలో సోమవారం 65 మంది రైతులకు ఫార్మా రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని ప్రతి గ్రామ సర్పంచ్ లు రైతులకు అవగాహన కల్పించి ఫార్మా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చూడాలని వ్యవసాయ అధికారి గంగుమల్లు కోరారు

# జిహెచ్ఎంసి ఏసీపీగా ప్రసాద్ బాధ్యతలు!

## ప్రజా సమస్యలకే ఫస్ట్ ప్రయారిటి

**అమీన్పూర్ జూన్ 15 సిరి న్యూస్**



అమీన్పూర్ జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న ప్రసాద్ సోమవారం బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. కోదాడ టు సిటీ యాక్షన్ కోదాడ మున్సిపాలిటీ నుండి బదిలీపై వచ్చిన ప్రసాద్ బాధ్యతలు చేపట్టిన వెంటనే తమ మార్కు చూపించడానికి రంగంలోకి దిగారు.

**సిబ్బందితో కలిసి సమావేశం:**

చార్జ్ తీసుకున్న వెంటనే టౌన్ ప్లానింగ్ సిబ్బంది. బిల్డింగ్ ఇన్స్పెక్టర్లతో ఏసిపి ప్రసాద్ అత్యవసర సమావేశం నిర్వహించారు. పెండింగ్ ఫైళ్లు క్షేత్రస్థాయి సమస్యలపై పూర్తి వివరాలు ఆరా తీశారు.

**ప్రజా సమస్యలకే ఫస్ట్ ప్రయారిటీ:**

సామాన్య ప్రజలకు టౌన్ ప్లానింగ్ విభాగం నుండి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వేగంగా సేవలు అందించడమే తమ మొదటి లక్ష్మని ఆయన ప్రకటించారు.

**గత ఏసిపి బదిలీ:**

ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన ఏసిపి పవన్ తాండూర్ కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ప్రసాద్ పూర్తి బాధ్యతలు చేపట్టారు.

**శుభాకాంక్షల వెల్లువ:**

జిహెచ్ఎంసి కి నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్ కు జిహెచ్ఎంసి అధికారులు సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు పుష్పగుచ్చాలు అందించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

# ఆసరా ఎటు పాయే? అవ్వ తాతల ఆకలి కేకలు!

## పెన్షన్లు ఇస్తారా చంపుతారా?

## సర్కిల్ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా

## కమిషనర్కు వినతి పత్రం

## సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు నాయిని లలిత



**అమీన్పూర్ జూన్ 15 సిరి న్యూస్**

కొత్తగా దరఖాస్తు చేసుకున్నా వారికి ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు న్యాయని లలిత ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అమీన్పూర్ సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కమిషనర్ కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షన్ల పైసా ఎక్కడ, ఆసరా కోసం ఎదురుచూపులు సర్కార్పై ముసలవ్వల అగ్రహం అని అన్నారు. వృద్ధులకు వితంతువులకు ఒంటరి మహిళలకు వికలాంగులకు ఇతర లబ్ధిదారులందరికీ ఆసరా పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని ఆమె డిమాండ్ వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలుగా కొత్తగా పెన్షన్లు రాక లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల ముందు పెన్షన్లు పెంచుతామని కొత్త పెన్షన్ దారులకు కూడా పెన్షన్లు అందజేస్తామని, కల్లబొల్లి మాటలు చెప్పి కాలయాపన చేస్తున్న ప్రభుత్వం అని ఆమె మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వం నిర్ణయం తీసుకొని అందరికీ పెన్షన్ అందేలా ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, సునీత, శ్రీనివాస్, భాస్కర్, జిలాని, యాదయ్య ,ఆంజనేయులు, బాలరాజు, విట్టల్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

- విద్యార్థులందరూ ప్రతిరోజు పాఠశాలకు రావాలి.
- బడీడు పిల్లలందరూ పాఠశాల లోనే ఉండాలి.
- కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి.
- మెదక్ జిల్లా విద్యాధికారి ఎస్. రాజు.




**మెదక్ జూన్, 15 (సిరిన్యూస్)**

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని జిల్లా విద్యాధికారి ఎస్.రాజు పేర్కొన్నారు.సోమవారం హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని పీఎంశ్రీ జడ్పిహెచ్ఎస్ కూచన్ పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల విద్యాధికారి ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోట్ బుక్స్ అందజేశారు .ఈసందర్భంగా మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సర ప్రారంభ రోజు కూచన్ పల్లి ఉన్నత పాఠశాలకు రావడం చాలా ఆనందకరంగా ఉందని అదే మాదిరిగా... విద్యార్థులు కూడా ప్రతిరోజు పాఠశాలకు హాజరై ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలు సరిగ్గా అర్థం చేసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. గ్రామంలో బడీడు పిల్లలందరూ ఖచ్చితంగా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. ఎవరైనా బడీడు పిల్లలు పాఠశాలకు రాకుండా ఉంటే వాళ్ళను గుర్తించి వాళ్లకు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ ఇవ్వాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. అదే మాదిరిగా విద్యార్థులు 100% అటెండెన్స్ ఉండే విధంగా ప్రతిరోజు పాఠశాలకు రావాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సాయంత్రం, ఉదయం వేళ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పాఠశాల ప్రారంభ రోజు నుంచే ఉంచాలని ఆయన కోరారు .ఈ కార్యక్రమంలో ఇతర ప్రైవేట్ పాఠశాల చదువుతున్న కొంతమంది 8 వ తరగతి విద్యార్థులను డీ ఈ వో గారి చేతుల మీదుగా అడ్మిషన్ పొందారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాచారం మధుమోహన్ పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల గురించి డీ ఈఓ.కు వివరిస్తూ..మండలంలోని అత్యధిక విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్న పాఠశాల కూచన్ పల్లి అని మరియు గత సంవత్సరం 10వ తరగతిలో 100 శాతం ఫలితాలు వచ్చాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పంతంగి శ్రీనివాస్ , ఎల్ మల్లారెడ్డి ,సందీప్ కృష్ణ, సంతోషి కుమారి , ఎల్లం , వినోద్ , కొండల్ రెడ్డి , రాజేందర్ రెడ్డి, రాజు, చక్రపాణి , శశి కుమార్ రెడ్డి, కృష్ణవేణి ,గంగమణి, సందీప్ రెడ్డి,ఎం ఆర్ సి సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్రస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో రుద్రహోమం

- అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు
- వేదమంత్రాల నడుమ ఆధ్యాత్మిక వేడుకలు

**గుమ్మడిదల, జూన్ 15 (సిరి న్యూస్) :**

అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం రుద్రహోమ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ రుద్రహోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టి భక్తులు భక్తి పారవశ్యంలో పాల్గొన్నారు. హిందూ సంప్రదాయంలో రుద్రహోమానికి విశిష్టమైన స్థానం ఉంది. దుష్టశక్తుల నివారణతో పాటు మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంలో రుద్రహోమం విశేష ఫలితాలను అందిస్తుందని అర్చకులు తెలిపారు. హోమ కార్యక్రమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వేదఘోషలు, శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మునిగిపోయింది. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది సోమయ్య మాట్లాడుతూ ఆలయంలో ప్రతి అమావాస్య రోజున రుద్రహోమాన్ని, ప్రతి పౌర్ణమి సందర్భంగా చండీహోమ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ హోమాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేయించుకోవాలనుకునే భక్తులు ఆలయ అధికారులను సంప్రదించవచ్చని సూచించారు.అమావాస్య




సందర్భంగా నిర్వహించిన రుద్రహోమం ద్వారా భక్తులకు శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం, ఆయుష్షు ప్రసాదిస్తారని అర్చకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రవీణ్, ఆలయ కమిటీ చైర్మన్ సద్ది విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాయిన్పల్లి ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టాలి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి – రైతుల ప్రయోజనాలను కాపాడాలి
- పద్మా దేవేందర్ రెడ్డి

**మెదక్, జూన్ 15 (సిరి న్యూస్) :**



మెదక్ జిల్లాలోని రాయిన్పల్లి ప్రాజెక్టు మరమ్మతులను తక్షణమే చేపట్టి రైతులకు సాగునీటి భరోసా కల్పించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు పద్మా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయిన్పల్లి ప్రాజెక్టు పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి సోమవారం మెదక్ కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు కలెక్టరేట్కు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించి రాయిన్పల్లి ప్రాజెక్టు మరమ్మతులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ప్రాజెక్టు నిర్లక్ష్యం కారణంగా ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మరమ్మతులు ఆలస్యం అయితే రైతులకు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రాయిన్పల్లి ప్రాజెక్టు మెదక్ ప్రాంత రైతులకు జీవనాధారమని, గత కొంతకాలంగా ప్రాజెక్టు మరమ్మతుల అంశాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, సాగునీటి వనరుల అభివృద్ధిపై స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని ఆమె ఆరోపించారు.ప్రాజెక్టు మరమ్మతులు పూర్తికాకపోతే సాగునీటి సరఫరాపై ప్రభావం పడటంతో పాటు వేలాది ఎకరాల పంటలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు అత్యవసర చర్యలు చేపట్టాలని వారు కోరారు.నిరసన అనంతరం బీఆర్ఎస్ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ను కలిసి వినతిపత్రం అందజేసింది. రాయిన్పల్లి ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక సమస్యలను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరింది. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే మరింత ఉధృతంగా ఉద్యమాలు నిర్వహిస్తామని పద్మా దేవేందర్ రెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## మెదక్ ఆర్డీఓ రమాదేవి హెచ్చరిక.

**రామాయంపేట, జూన్ 16 (సిరి న్యూస్)**

ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ ఆర్డీఓ రమాదేవి హెచ్చరించారు. రామాయంపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీఎల్ఓ (BLO), బీఎల్ఏ (BLA)ల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా నేటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమంపై బీఎల్ఓలు, బీఎల్ఏలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం (SIR)ను ఎన్నికల కమిషన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా సహించబోమన్నారు.ఓటరు జాబితాల ప్రక్షాళన ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై వారి హోదాతో సంబంధం లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు గులాబీలతో స్వాగతం

**పాపన్నపేట, జూన్ 15 (సిరి న్యూస్):**

బడి ప్రారంభం సందర్భంగా వినూత్న రీతిలో విద్యార్థులకు స్వాగతం పలికారు. మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో వేసవి సెలవుల అనంతరం మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, పాఠశాల హెచ్ఎం మహేశ్వర్ చేతుల మీదుగా విద్యార్థులకు గులాబీ పూలతో స్వాగతం పలుకుతూ పాఠ్యపుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ బడిలోనే అందుతుందన్నారు. విద్యావంతులైన ఉపాధ్యాయులు కేవలం ప్రభుత్వ బడిలోనే ఉంటారని, తమ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ బడులకు పంపాల్సిందిగా ఆయన తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, అంజాగౌడ్, ప్రవీణ్, భట్టు నాగరాజు, వేణుగోపాల్ రెడ్డి, మంగ నర్సింలు, యాదయ్య, మోహన్ రావ్, నింగప్ప, రియాజ్, కృష్ణ కాంత్, శ్రీహరి, రవికాంత్ ,విశ్వనాథ్ , సుభాష్ , మహమూద్ హన్నన్, ఇందిర, పద్మ , జకెరా, లక్ష్మీ, రజిత తదితరులు పాల్గొన్నారు.



# ఓటేస్తేనే ఇల్లు ఇస్తారా..?

- **ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం అర్థాంతరంగా నిలిపివేసిన సర్పంచ్, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.**
- **ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందచేసిన బాధితురాలు సంధ్య.**

**మెదక్,జూన్,15 (సిరిన్యూస్)**

మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని కుర్తివాడ గ్రామానికి చెందిన ఆర్. సంధ్య భర్త ఆర్.నవీన్‌కు ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరైంది.ఆర్థిక స్థోమత లేకపోవడంతో గ్రామ పెద్దల సూచన మేరకు ఇంటి నిర్మాణ బాధ్యతలను ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు బాధితురాలు సంధ్య తెలిపారు. కాంట్రాక్టర్ మొదట బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మాణ పనులు పూర్తి చేసినప్పటికీ, అనంతరం నిర్మాణ సామగ్రి సరఫరా నిలిపివేసి పనులను అర్థాంతరంగా ఆపివేశాడని ఆమె ఆరోపించారు.నిర్మాణ పనులు ఎందుకు నిలిపివేశారని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా, గ్రామ సర్పంచ్ శ్రీధర్ సూచన మేరకే పనులు ఆపివేశామని సమాధానం ఇచ్చినట్లు సంధ్య పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో తమ కుటుంబం తనకు ఓటు వేయలేదనే కక్షతో ఇంటి నిర్మాణాన్ని నిలిపివేశారని ఆరోపించారు.ఈ విషయమై పలుమార్లు కాంట్రాక్టర్‌ను సంప్రదించినా సర్పంచ్‌ను కలవాలని సూచించారని, అనంతరం సర్పంచ్‌ను కలిసి సమస్య వివరించగా తనను గెలిపించిన 30 మంది అనుమతి ఇస్తేనే ఇంటి నిర్మాణం కొనసాగిస్తానని చెప్పినట్లు సంధ్య తెలిపారు. అంతేకాకుండా పదేపదే తన ఇంటికి రావద్దంటూ హెచ్చరించినట్లు ఆరోపించారు. ఇప్పటికే బేస్‌మెంట్ పనులు పూర్తవడంతో సంబంధిత బిల్లును కాంట్రాక్టర్‌కు చెల్లించినట్లు బాధితురాలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి, తమ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా జోక్యం చేసుకోవాలని కోరారు. అలాగే ఇంటి నిర్మాణాన్ని నిలిపివేసిన సర్పంచ్‌పై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు కాంట్రాక్టర్ ద్వారా పెండింగ్ పనులను పూర్తి చేయించి బిల్లులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.తమ కుటుంబ పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని అర్థాంతరంగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని



తిరిగి ప్రారంభించి పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను బాధితురాలు సంధ్య వేడుకున్నారు.

**ఇందిరమ్మ ఇంటి నిర్మాణం నిలిపివేతపై కలెక్టర్‌కు వినతి**

బాధితురాలికి న్యాయం చేయాలి మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి ఈ సమస్యపై మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి స్పందించారు.బాధితురాలు సంధ్య ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న పద్మదేవేందర్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను వివరించారు. ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా వెంటనే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాల ఫలాలను పొందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి,బాధిత కుటుంబానికి ఇల్లు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

# బడి లేని గ్రామాన్ని ఊహించగలమా?

- **23 వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి**
- **ముఖ్యమంత్రికి మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి బహిరంగ లేఖ**

**రామాయంపేట, జూన్ 15 (సిరి న్యూస్)**



రాష్ట్రంలో 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామంటూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇటీవల బెంగళూరులో చేసిన ప్రకటనను మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఈ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆయన సీఎంకు సోమవారం నాడు ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. వచ్చే తరాలకు విద్యను దూరం చేయవద్దని, ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే ఆలోచన చారిత్రక తప్పిదం అవుతుందన్నారు.

**బడి లేని గ్రామాన్ని ఊహించగలమా?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా 23 వేల పాఠశాలలను మూసివేస్తే, రాష్ట్రంలో దాదాపు 15,000 గ్రామాలు పాఠశాలలు లేని గ్రామాలుగా మారిపోతాయని శశిధర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బడి లేని గ్రామాన్ని ఊహించగలమా? అని ప్రశ్నించిన ఆయన, నాణ్యమైన విద్యను అందిస్తామని చెబుతూనే, మరోపక్క పాఠశాలల మూసివేతకు సిద్ధం కావడం ప్రభుత్వ ద్వంద్వ విధానానికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు సంబంధించి ప్రభుత్వానికి సరైన స్పష్టత లేదని విమర్శించారు. రాష్ట్రంలో దాదాపు 66 శాతం మంది విద్యార్థులు 12,000 ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతుండగా, మిగిలిన 34 శాతం మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు 25 వేల ప్రభుత్వ పాఠశాలలపైనే ఆధారపడి చదువుకుంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో, గతంలో విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి, ప్రస్తుత బడ్జెట్‌లో కనీసం 8.2 శాతం కూడా మించకపోవడం శోచనీయమన్నారు. రాబోయే రోజుల్లో విద్యా రంగానికి బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయంపై వెనక్కి తగ్గకుండా, పాఠశాలలను మూసివేస్తే.. ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యా రంగాన్ని బలోపేతం చేయాలే తప్ప, ప్రభుత్వ పాఠశాలల ఉనికిని దెబ్బతీయవద్దని శశిధర్ రెడ్డి ముఖ్యమంత్రికి హితవు పలికారు.

# విద్యార్థులకు ఘన స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

**వెల్దుర్తి,జూన్ 15,( సిరి న్యూస్ ):**

పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి★ నందు నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం ఘన స్వాగతం పలికారు. పాఠశాలకు విచ్చేసిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఉపాధ్యాయ బృందం పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించి స్వాగతం పలికారు. విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాఠశాలలో అడుగు పెట్టగా, ఉపాధ్యాయులు వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆత్మీయంగా పలకరించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అందజేయబడుతున్న ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి సమయానికి పుస్తకాలను అందుకొని విద్యాభ్యాసాన్ని ప్రారంభించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పుస్తకాల పంపిణీ అనంతరం ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్య



జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనమని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.అలాగే గత విద్యా సంవత్సరంలో పాఠశాల సాధించిన అద్భుత విజయాలను ప్రస్తావిస్తూ, ఈ విద్యా సంవత్సరంలో కూడా మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, పాఠశాల పట్ల మరింత అనుబంధాన్ని పెంపొందించింది. విద్యార్థులు సంతోషంగా కార్యక్రమంలో పాల్గొని, కొత్త పుస్తకాలతో తమ




విద్యాభ్యాసాన్ని ఉత్సాహంగా ప్రారంభించారు. మొత్తం కార్యక్రమం ఆహ్లాదకరమైన వాతావరణంలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, చార్లెస్, అర్చన, అమూల్య, నవనీత, జయసుధ, శైలజ, సునీత, వాణిశ్రీ, ధనరాజ్, విజయ్ మోహన్ రాజ్, రేణుకా దేవి, ప్రశాంతి, ఖదీర్ పాషా, రాధిక, రాము తదితరులు పాల్గొనడం జరిగింది.

# అమావాస్య సందర్భంగా శ్రీబగలాముఖి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు.!

- **వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించిన పబ్బా స్వరూప రాణి రమేష్ గుప్తా కుటుంబ సభ్యులు!!**

**శివంపేట జూన్ 15 ( సిరి న్యూస్ )**





శివంపేట మండల కేంద్రంలో నిర్మితమైన శ్రీ భగలాముఖి శక్తిపీఠం భారతదేశ నలుమూలల ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి శ్రీ భగలాముఖి శక్తి పీఠం అమ్మవారి యొక్కవిశిష్టలు తెలుసుకొని అనేకమంది భక్తులు ప్రతినిత్యం ప్రజలు భారీ సంఖ్యలో ప్రతినిత్యం అమ్మవారిని దర్శించుకోవడం కోసం రావడం జరుగుతుంది అమ్మవారి ప్రీతి పాత్రమైన రోజుఅమావాస్య కావడం సందర్భంగా శ్రీ భగలాముఖి అమ్మవారి వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ప్రాంగణంలోని యాగశాలలో వేద పండితుల ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించగా ఆలయ భూదాత పబ్బస్వరూప రాణి రమేష్ గుప్తా పలువురు భక్తులు పెద్ద ఎత్తున యజ్ఞం లోపాల్గొనగా ఆలయ ట్రస్టు చైర్మన్ ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రుల లక్ష్మి వెంకటేశ్వరశర్మ పండితులు భగలాముఖి అమ్మవారికి మహా మంత్రహవనం మహాపూజ అర్చన పంచామృతలతో అభిషేకం హరిదార్చన హవనం పూర్ణాహుతితో విశేష పూజలతో ముగించారు.వచ్చిన భక్తులకు పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి యొక్క విశేషాలు తెలియజేసి తీర్థప్రసాదాలు అందజేశారు.అమావాస్య సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కీర్తిశేషులు పబ్బ రామమ్మ అంజయ్య గుప్త వారి స్మారకార్థం కుటుంబ సభ్యులు పబ్బ స్వరూప రాణి రమేష్ గుప్త పబ్బ స్వాతి మహేష్ గుప్తా అన్నదాన కార్యక్రమాన్ని వచ్చిన భక్తులకు వివిధ రకాల తో తయారు చేసిన అన్నదానం వితరణ చేశారు.వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని అన్న ప్రసాదాన్ని మహా ప్రసాదంగా స్వీకరించారు .భక్తులకు షామియానాలు ఏర్పాటు చేసి శుద్ధమైన త్రాగునీరు ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమంలో శివంపేట గ్రామ సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ ముదిరాజ్, ఉప సర్పంచ్ ఇసు గారి మల్లేశం,బాసంపల్లి పోచగౌడ్ కొండల్ యం. రాజు, దొడ్ల అశోక్, రాజీపేట రాములు, డ్రైవర్ సాయి, రాజపేట శేఖర్, సాకలి రమేష్, పీఎంజి యువసేన సభ్యులు భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బస్టాండా..? బైక్ పార్కింగా..?

- **ప్రయాణికుల కోసం నిర్మించిన షెల్టర్ వాహనాల అడ్డాగా మారిన వైనం**



**గుమ్మడిదల, జూన్ 15 (సిరి న్యూస్):**

గుమ్మడిదల బస్టాండ్‌ను చూస్తే ఇది ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్టాండా, లేక బైకుల పార్కింగా అనే సందేహం కలుగుతోంది. ప్రయాణికులు ఎండ, వర్షాల నుంచి రక్షణ పొందేందుకు ఏర్పాటు చేసిన బస్టాండ్ ప్రస్తుతం ద్విచక్ర వాహనాల పార్కింగ్ కేంద్రంగా మారిపోయింది. బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు కూర్చునే, నిలబడే అవకాశం లేకుండా వాహనాలు ఆక్రమిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరోవైపు, బస్టాండ్ పరిసరాల్లో కొందరు నిత్యం నిద్రించడం కూడా పరిపాటిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఈ బస్టాండ్ అసలు ఉద్దేశాన్ని కోల్పోయి, నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీ పాలకవర్గం లేని సమయంలో చర్యలు తీసుకున్న సందర్భాలు లేవు. పాలకవర్గం ఏర్పాటు జరిగిన తర్వాత కూడా బస్టాండ్ విషయంలో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్న పట్టించుకున్న పాపాన పోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి బస్టాండ్ ఆవరణలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను తొలగించి, ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి..

**సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**రామచంద్రపురం (పటాన్చెరు), జూన్ 15 (సిరి న్యూస్):**

అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెండు సర్కిళ్ల పరిధిలోని తొమ్మిది డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. నూతన కాలనీల్లో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. చెత్త తొలగింపు చర్యలను ముమ్మరం చేయడంతో పాటు కాలువలను శుభ్రంగా ఉంచి, దోమల నివారణ చర్యలు చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.బొల్లారం స్టేడియం, పాటి వివేకానంద స్టేడియం అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


- **అందోలు మండల విధ్యాధికారి బండి కృష్ణ**
- **జోగిపేటలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కుల పంపిణీ**



**జోగిపేట, జూన్ 15, సిరి న్యూస్ :**

జోగిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులను అందోలు మండల విద్యాధికారి బండి కృష్ణ పంపిణీ చేసారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులను అందజేసారు. ఈ సందర్భంగా ఎంఈఓ బండి కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, మధ్యాహ్న భోజన పథకం, వారానికి మూడు రోజులు కోడిగుడ్లు, రెండు జతల యూనిఫారాలు, పరిశుభ్రమైన తాగునీరు, డిజిటల్ బోధన, క్రీడా మరియు సహపాఠ్య కార్యక్రమాలు వంటి అనేక సౌకర్యాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పిస్తున్నందున ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం నరేష్ కుమార్, ఉపాధ్యాయులు ఎ. మాణయ్య, మంజ్యా నాయక్, కె.రాములు, త్రినాధ్ రావు, జి. అనిల్ కుమార్, ఎస్. నరోత్తం కుమార్, ఎ. లక్ష్మణ్, సి.హెచ్. చంద్రశేఖర్, రజినీ కాంత్, వి.బి. శ్రీనివాస్, బి. రవికుమార్, పి.వెంకటేశం, ఎ. చంద్రశేఖర్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నిరుడి ప్రభాకర్ నియామకం



**వెల్దుర్తి, జూన్ 15, (సిరి న్యూస్ ):**

మెదక్ జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శిగా వెల్దుర్తి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన నీరుడి ప్రభాకర్ ను మెదక్ జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ్ నియమాక పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నన్ను ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ్, ఉపాధ్యక్షులు ఆనంద్, యూత్ అధ్యక్షుడు దాడిగా నరేష్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నల్లవల్లిలో బీఆర్ఎస్‌కు బలం..

- కాంగ్రెస్ ఎన్ఎంఆర్ టీమ్ సభ్యుల చేరిక

**రామచంద్రపురం, జూన్ 15 (సిరి న్యూస్):**

బీఆర్ఎస్ పార్టీ ప్రజా సంక్షేమ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎన్ఎంఆర్ టీమ్ సభ్యులు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.రామచంద్రపురం లోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో గుమ్మడిదల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ పోచయ్య, గ్రామ అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో మధు, హర్ష, అనిల్ కుమార్, అరుణ్ తేజ, సాయి, శ్రీకాంత్, శ్రీను, హరీష్, నరేష్, సాజిద్ ఖాన్‌లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆదర్శ్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పనిచేస్తోందన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రత్యేక పూజలు.



**రామాయంపేట,( మెదక్ )జూన్ 15 (సిరి న్యూస్)**

అయ్యప్పస్వామి దేవాలయ రజతోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం మహాగణపతి పూజ వైభవంగా జరిగింది. పుణ్యాహ వాచనం, అఖండ దీపస్థాపన శివానంద లహరి పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహాలింగార్చన, ప్రదోష పూజ చేపట్టారు. రెండవరోజు భక్తిశ్రద్ధలతో హోమం, ధ్వజారోహణం నిర్వహించగా, వేదపండితులు సామవేద పారాయణం పఠించారు. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆలయంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సేవకుడు వైద్య రాజు, బాధ్యులు ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, అష్టకాల విద్యామనోహర్ శర్మ, ఆలయ పూజారి అశోక్, బాధ్యులు వీర్ కుమార్, రాగి చక్రపాణి, కొండ శ్రీనివాస్, గంగ లక్ష్మీపతి, రమేశ్, శ్రీకాంత్ రెడ్డి, యచం చిన్న రాజు, వెంకట్ నారాయణ, ప్రభు గౌడ్, పార్థివనాథ్ పాల్గొన్నారు.



# రైతు క'న్నీళ్ల' గోస పట్టదా..!

- రాయిన్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులు వెంటనే చేపట్టాలి.
- 2,500 ఎకరాల సాగుకు జీవనాడి ఈ ప్రాజెక్టు.
- రైతులకు సాగునీరు అందించండి..
- రాయిన్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులపై బీఆర్ఎస్ ఆందోళన.
- రాయిన్‌పల్లి హై లెవల్ కాల్వ ధోని పునరుద్ధరణకు డిమాండ్.
- మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మ దేవేందర్ రెడ్డి.
- కలెక్టరేట్ ముందు బీఆర్ఎస్ ధర్నా..

**మెదక్,జూన్,15 (సిరిన్యూస్)**





రాయిన్‌పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ, లో లెవల్ దెబ్బతిన్న ధోనికి తాత్కాలిక మరమ్మతులు వెంటనే చేపట్టాలని మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, రైతులు సోమవారం మెదక్ కలెక్టరేట్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాల కారణంగా మెదక్ మండలంలోని రాయిన్‌పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ, లో లెవల్ ధోని కొట్టుకుపోయిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2,500 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు.ధోని దెబ్బతిని సంవత్సరం గడిచినా ప్రభుత్వం ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.రాయిన్‌పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ ధోనికి తక్షణమే మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.రాయిన్‌పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ ద్వారా తిమ్మానగర్,మక్తా భూపతిపూర్, గుట్టకిందిపల్లి,శివాయిపల్లి,మల్కాపూర్ తండా,వెంకటాపూర్, కొంటూర్ గ్రామాల రైతులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి వ్యవసాయం సాగు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ కాల్వ ద్వారా మెదక్ పట్టణ పరిధిలోని గోసముద్రం, పిట్లంబేస్, బంగ్లా చెరువులు కూడా నిండుతాయని వివరించారు. రాయిన్‌పల్లి ప్రాజెక్టు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్య రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు బట్టి. జగపతి,కృష్ణారెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజగౌడ్,మాజీ ఎంపీపీ కిష్టయ్య,మాజీ వైస్ ఎంపీపీ,మార్గం. ఆంజనేయులు, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు మాయ మల్లేశం, ఆర్.కే. శ్రీనివాస్, బీమరి కిషోర్, బీఆర్ఎస్ నాయకులు ఇందాద్ , ఎలక్షన్ రెడ్డి, బాలయ్య,గట్టయ్య, సిద్దిరాములు, చంద్రపాల్, యంబీపూర్.మహేష్, గంగయ్య, సత్య గౌడ్, రవి,శ్రీనివాస్ గౌడ్, మల్లేశం,మోహన్ నాయక్, శ్రీనివాస్, మేకల సాయిలు ,చెన్న గౌడ్ ,యామిరెడ్డి ,సాయ గౌడ్ ,రాజేశ్వరరావు, సాప సాయిలు ,రామచంద్ర రెడ్డి ,నరేందర్ రెడ్డి, శ్రీను నాయక్, శ్రీనివాస్, జగన్ గురుమూర్తి గౌడ్, బద్రి. మల్లేశం, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్ ,పడాల శ్రీనివాస్, ప్రభాకర్ ,స్వామి ,లక్ష్మణ్ ,వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కన్‌సాన్‌పల్లి పెద్ద చెరువు వివాదంపై 'మంత్రం' ఫలించేనా..?

- మంత్రి దామోదరను కలిసిన కన్‌సాన్‌పల్లి, పెద్దాపూర్ మత్స్యకారులు
- చేపలు పట్టే హక్కు తమదంటే తమదేనంటున్న ఇరు గ్రామాల మత్స్యకారులు
- సమన్యాయం జరిగేలా చూస్తానని మంత్రి హామీ

**జోగిపేట, జూన్ 15, (సిరి న్యూస్)::**





పంగారెడ్డి జిల్లా అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి, అల్లాదుర్గ్ మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామాల మధ్య విస్తరించిన ఉన్న పెద్ద చెరువు పంచాయితీ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహా వద్దకు చేరింది.పెద్దాపూర్ మత్స్యకారులు పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు మత్స్యకార శాఖ అధికారుల నుండి అనుమతి తీసుకొని ఈనెల 6న చెరువులో చేపలు పట్టేందుకు సిద్ధమవగా, కన్‌సాన్‌పల్లి మత్స్యకారులు తమ గ్రామానికి చెందిన 33 మంది మత్స్యకారులకు సభ్యత్వం కల్పిస్తూ వెలువడిన అధికార ఉత్తర్వుల ప్రకారం తమకు కూడా చేపలు పట్టే హక్కు ఉందని వారి అడ్డుకునేందుకు చెరువు వద్దకు చేరుకున్నారు. విషయం తెలసిన అల్లాదుర్గ్, జోగిపేట సర్కిల్ పరిధిలలోని పోలీసులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకొని శాంతిభద్రతలను దష్టిలో ఉంచుకొని ఇరు గ్రామాల మత్స్యకారులతో మాట్లాడి అక్కడి నుండి పంపించిన విషయం తెలిసిందే. దీంతో పెద్దాపూర్ మత్స్యకారులు శనివారం మంత్రిని కలిసి చేపలు పట్టే హక్కు తమకే కల్పించాలని కోరారు. ఆదివారం కన్‌సాన్‌పల్లి మత్స్యకారులు హైద్రాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి 33 మందికి సభ్యత్వం కల్పిస్తూ వెలువడిన అధికార ఉత్వర్వుల ప్రకారం తమకు సభ్యత్వం కల్పించి చేపలు పట్టడంలో తమకు హక్కు కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో ఇరు గ్రామాల మత్స్యకారులు సామరస్యంగా ఉండాలని ఇరువురికి సమన్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా మంత్రి హామి ఇచ్చినట్లుగా సమాచారం. 30 ఏళ్ల సమస్య పరిష్కారమయ్యేనా..?పెద్ద చెరువులో చేపలు పట్టేహక్కు విషయంలో గడిపెద్దాపూర్, కన్‌సాన్‌పల్లి మత్స్యకారులు ఒకరిపై ఒకరూ దాడిచేసుకొని కేసుల వరకు వెళ్లిన ఘటనలు ఉన్నాయి. ఈ రెండు గ్రామాలు అందోల్ నియోజకవర్గ పరిధిలోనే ఉండడంతో ఇక్కడి నుండి గతంలో ప్రాతినిథ్యం వహించిన ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరూ కూడా వివాదం పరిష్కారం వైపు కన్నెత్తి చూడలేదు. ఒక గ్రామానికి అనుకూలంగా చెప్పిన మరో గ్రామ మత్స్యకారుల నుండి వ్యతిరేకత వస్తుందనే భయంతో వివాద పరిష్కారం చూపేందుకు పెద్దగా ఆసక్తి చూపలేకపోయారు. మొదటిసారిగా ఇరు గ్రామాల మత్స్యకారులు మంత్రిని కలువడం సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని అందుకు రెండు గ్రామాల మత్స్యకారులు సామరస్యంగా ఉండాలని మంత్రి హామీ ఇచ్చారు. .

**కోర్టు తీర్పు ఎవరి వైపు..?**

పెద్ద చెరువులో చేపలు పట్టే హక్కుల సాధనలో తమకే చేపలు పట్టే హక్కు కల్పించాలని పెద్దాపూర్ మత్స్యకారులు, అధికార ఉత్వర్వుల ప్రకారం తమకు కూడా హక్కు కల్పించాలని కన్‌సాన్‌పల్లి మత్స్యకారులు ఇప్పటికే కోర్టుకు వెళ్లగా ఈనెల 16న కోర్టులో తాము వాదనలు వినిపించడం ద్వారా తమకే అనుకూలంగా తీర్పు వెలువడనుందని కన్‌సాన్‌పల్లి మత్స్యకారులు చెబుతున్నారు.

## ఆటపాటలకు బై... పుస్తకాలతో కొత్త ప్రయాణం





- నూతన విద్యా సంవత్సరానికి విద్యార్థుల ఘన స్వాగతం
- స్నేహితుల కలయికతో పాఠశాలల్లో సందడి
- మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ
- సెలవుల సందడి ముగిసింది
- కలల సాధనకు మరో అడుగు పడింది
- పుస్తకాలతో కొత్త ప్రయాణం మొదలైంది

**గుమ్మడిదల,జూన్ 15(సిరి న్యూస్) :**

నూతన విద్యా సంవత్సరం సోమవారం ప్రారంభం కావడంతో విద్యార్థులు ఆటపాటలకు తాత్కాలికంగా వీడ్కోలు పలికి చదువుల బాట పట్టారు. వేసవి సెలవుల అనంతరం చాలా రోజుల తర్వాత పాఠశాలలకు చేరుకున్న చిన్నారులు ఉత్సాహంతో సందడి చేశారు. స్నేహితులను, ఉపాధ్యాయులను తిరిగి కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సెలవు దినాల్లో తాము చేసిన అల్లరి పనులు, వెళ్లిన ప్రదేశాలు, కొత్త అనుభవాలను ఒకరితో ఒకరు చెప్పుకుంటూ విద్యార్థులు తొలి రోజును ఆహ్లాదకరంగా గడిపారు. పాఠశాల ఆవరణలు విద్యార్థుల కేరింతలు, నవ్వులతో కళకళలాడాయి. చిన్నారుల సందడితో విద్యాలయాలు మళ్లీ పాత కళను సంతరించుకున్నాయి. నూతన విద్యా సంవత్సరం తొలి రోజే పాఠశాలల్లో నెలకొన్న సందడి, విద్యార్థుల ముఖాల్లో కనిపించిన చిరునవ్వులు, ఉపాధ్యాయుల ఆత్మీయ స్వాగతం కొత్త విద్యా సంవత్సరానికి శుభారంభాన్ని చాటిచెప్పాయి. ఈ విద్యా సంవత్సరంలో మరింత కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవచ్చని, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు.

**తొలి రోజే పాఠ్యపుస్తకాలు పంపిణీ**

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలి రోజే విద్యాశాఖ అధికారులు పంపించిన పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. పుస్తకాలు చేతికి అందడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేయగా, తల్లిదండ్రులు ప్రభుత్వ ఏర్పాట్లపై హర్షం వ్యక్తం చేశారు. మొదటి రోజే పాఠ్య సామగ్రి అందజేయడం వల్ల విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసాన్ని ప్రారంభించే అవకాశం లభించింది.

**కానుకుంట పాఠశాలలో**

గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక స్వాగతం పలికారు. పాఠశాల ఉపాధ్యాయులు వెరైటీ పద్ధతిలో చిన్నారులను ఆహ్వానించి, పుష్పాలతో స్వాగతం చెప్పడంతో పాటు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వినూత్న స్వాగతం విద్యార్థులను ఆకట్టుకోగా, చిన్నారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

# సీఎస్ఆర్ నిధులతో గ్రామీణాభివృద్ధికి పరిశ్రమల చేయూత

- బయోగ్యాస్, వర్మీ కంపోస్ట్, చెరువుల అభివృద్ధి పనులకు శ్రీకారం
- గ్రామీణాభివృద్ధికి న్యూ ల్యాండ్ ఫౌండేషన్ చేయూత
- బయోగ్యాస్, వర్మీ కంపోస్ట్, చెరువుల అభివృద్ధికి పరిశ్రమ ముందడుగు



**గుమ్మడిదల, జూన్ 15 (సిరి న్యూస్) :**

సీఎస్ఆర్ నిధులతో గ్రామీణాభివృద్ధికి తోడ్పడే దిశగా పరిశ్రమలు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి, దోమడుగు గ్రామాల్లో న్యూ ల్యాండ్ ఫౌండేషన్, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వర్మీ కంపోస్ట్ యూనిట్లు, బయోగ్యాస్ యూనిట్లు, చెరువుల అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామాల్లో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. గుమ్మడిదల మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి, లక్ష్మాపూర్, కొత్తపల్లి, రామ్‌రెడ్డిబావి, లక్ష్మాపూర్ తండా, బొంతపల్లి, దోమడుగు గ్రామాల్లో బయోగ్యాస్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా బొంతపల్లి, నల్లవల్లి, లక్ష్మాపూర్, నాగిరెడ్డిగూడెం, కానుకుంట, రామ్‌రెడ్డిబావి, దోమడుగు గ్రామాల్లో వర్మీ కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ యూనిట్ల ద్వారా రైతులకు సేంద్రియ ఎరువులు అందుబాటులోకి రావడంతో పాటు వ్యవసాయ వ్యయాలు తగ్గే అవకాశం ఉందన్నారు. బొంతపల్లి గ్రామంలోని అల్కకుంట చెరువును సుందరీకరణ పేరుతో అభివృద్ధి చేసి, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. చెరువుల పునరుద్ధరణతో పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు గ్రామాల నీటి అవసరాల తీర్చడంలో కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో గుమ్మడిదల పురపాలక సంఘం చైర్మన్ కుమార్ గౌడ్, కౌన్సిలర్లు రాజిరెడ్డి, చక్రపాణి, జైపాల్ రెడ్డి, న్యూ ల్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధి రవి ప్రతాప్ సింగ్, హెచ్ఆర్ ప్రతినిధులు యాదగిరి, సూర్య భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



# శిశువు విక్రయాలు జరిగిన పట్టించుకోని అధికారులు



**వెల్దుర్తి,జూన్ 15, (సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలం ఉప్పు లింగాపూర్ గ్రామం శిశు విక్రయాలకు అడ్డగా మారిందని ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. గ్రామంలో ఇటీవల రెండు శిశువిక్రయాల ఘటనలు వెలుగులోకి రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ శిశువును విక్రయించిన ఘటన చోటు చేసుకుంది అయితే గ్రామస్తుల ఆగ్రహంతో శిశువును కొనుగోలు చేసిన వ్యక్తులు తిరిగి తల్లిదండ్రులకు అప్పగించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనకు మరవక ముందే మరో శిశువిక్రయం జరిగినట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఈ మధ్య జన్మించిన శిశువును మండల కేంద్రానికి చెందిన ఓ మధ్యవర్తి ద్వారా మగ శిశువును విక్రయించినట్లు గ్రామస్తులు ద్వారా విషయం తెలుసుకున్న ఐసీడీ ఎస్, సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. బాలల సంరక్షణ బాధ్యత కలిగిన అధికారులు శిశు విక్రయాలు జరిగిన తర్వాత మాత్రమే స్పందిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శిశు విక్రయాల వంటి ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని బాధ్యులను శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విచారణలో బాలల సంరక్షణ అధికారి శంకర్ గౌడ్, పోలీసులు, ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టణ రూపురేఖలు మార్చే దిశగా అభివృద్ధి





- రూ.2.70 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు
- ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత – ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం

**మెదక్, జూన్15 (సిరిన్యూస్)**

మెదక్ పట్టణ రూపురేఖలు మార్చే దిశగా భారీ అభివృద్ధికి మరో కీలక అడుగు పడిందని మెదక్ శాసన సభ్యులు డా. మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో మొత్తం రూ.2 కోట్ల 70 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, సీసీ డ్రెయిన్లు, స్లాబులు, తాగునీటి సదుపాయాల కల్పన వంటి కీలక పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ప్రతి కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, "మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం అని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నానన్నారు . అభివృద్ధి ఫలాలు ప్రతి వార్డుకు, ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం పని చేస్తున్నానని తెలిపారు.ప్రతి వార్డులో అభివృద్ధి జోరు – సీసీ రోడ్లు, డ్రెయిన్లు, స్లాబులతో మౌలిక వసతుల బలోపేతం చేస్తానని తెలిపారు.మొదటగా 10వ వార్డులో ఎండి అత్తర్ షరీఫ్ నుండి జియావుద్దీన్, తిరుపతి ఇంటి వరకు అలాగే బస్తీ దవాఖానా నుండి గౌడ నాగులు, బండి నర్సింలు ఇంటి వరకు రూ.21 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా నాణ్యమైన రోడ్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం 27వ వార్డులో రూ.35 లక్షల వ్యయంతో వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. 11వ వార్డులోని సాయినగర్ కాలనీ, వెంకట్రావు నగర్ కాలనీ, రషీద్ కాలనీలలో రూ.52 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.13వ వార్డు, నల్లపోచమ్మ కాలనీ, మీరా కాలనీలలో రూ.1 కోటి 6 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.అదేవిధంగా 14వ వార్డులో శ్రీ గట్టమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో రూ.9 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు.24వ వార్డులో రూ.30 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.15వ వార్డులో ఖైరత్ అలీ ఇంటి నుండి ఖైసర్ పాషా ఇంటి వరకు, హైదర్ ఇంటి నుండి రజక సంఘం వరకు, రహమత్ ఇంటి నుండి రామవ్వ ఇంటి వరకు వివిధ ప్రాంతాల్లో రూ.17.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.తాగునీటి సమస్యకు చెక్ – MSSO ఆధ్వర్యంలో 3 బోరు మోటార్లను ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఇసుక కుప్పలు సీజ్





**పాపన్నపేట్ జూన్ 15 (సిరి న్యూస్) :**

ఈరోజు మధ్యాహ్న సమయంలో కుర్తివాడ గ్రామ శివారు యందలి మంజీరా నది నుండి పలుచోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక నిల్వలను గుర్తించితిమి, ఇట్టి ఇసుక నిల్వలు సుమారు గా 50 – 60 ట్రాక్టర్ల ఇసుక కలదని గుర్తించినాము. ఇట్టి ఇసుక నిలువ లు అక్రమమైనవి అని నిర్ధారితమైనది. కావున గ్రామ పాలన అధికారి సమక్షంలో సీజ్ చేసి అతని సంరక్షణలో ఉంచనైనది..

# ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం





**తూప్రాన్ జూన్ 15 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పట్టణంలోని ఏబి కాలనీలో సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు గడ్డివాము లో మంటలు వ్యాపించడంతో సమాచారం తెలుసుకున్న తూప్రాన్ ఎస్ఐ గంగరాజు సాయక చర్యలు చేపట్టిన తూప్రాన్ పట్టణంలో అగ్నిమాపక కేంద్రం అందుబాటులో లేకపోవడం వల్ల ఇతర ప్రాంతాల నుండి అగ్నిమాపక యంత్రం వచ్చేసరికి గడ్డివాము కాళీ బూడిదవడంతో యజమాని తూప్రాన్ మున్సిపల్ 14వ వార్డు కౌన్సిలర్ దుర్గం నవిత నాగేష్ మాట్లాడుతూ పశుగాసం కోసం ఏర్పాటుచేసిన గడ్డివాము దగ్ధమవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని తెలిపాడు

# ప్రభుత్వం బైండ్ల కులస్తులకు కులధ్రువ పత్రాలను అందజేయాలి

**బైండ్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బైండ్ల పరశురాములు తొగుట తహసిల్దార్ కు వినతిపత్రం అందజేత**

**తొగుట, జూన్ 15, (సిరి న్యూస్):**

రాష్ట్ర ప్రభుత్వం బైండ్ల కులస్తులకు కుల ధ్రువ పత్రాలను అందజేయాలని బైండ్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండ్ల పరిశ్రమలు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన జిల్లా కోశాధికారి బైండ్ల రవీందర్, తొగుట మండల అధ్యక్షులు బైండ్ల మురళిలతో కలిసి తొగుటలో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ మహ్మద్ సమీర్ అహ్మద్ ఖాన్ కు బైండ్ల కులస్తులకు కుల ధ్రువ పత్రం మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో బైండ్ల కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలను అందజేసి గుర్తింపును ఇవ్వాలని కోరారు. తాత ముత్తాతల నాటి నుండి గ్రామదేవతలకు సేవలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నామని తమను ప్రభుత్వం గుర్తించి తమ ఎదుగుదలకు భరోసాను ఇవ్వాలని కోరారు. సంవత్సరాలు గడుస్తున్నా అదే కులవృత్తిని నమ్ముకుని జీవనాన్ని కొనసాగిస్తున్నామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నారు. తమకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనార్దన్, సుధాకర్, యాదగిరి, రమేష్, రంజిత్, గణేష్, రామస్వామి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



# కాకరకాయ ఒక్కసారి ఇలా ట్రై చేసి చూడండి

కాకరకాయ పేరు వింటేనే చాలామంది ముఖం తిప్పేసుకుంటారు. ఇంట్లో కాకరకాయ కూర చేశారంటే ఆ రోజు ఉపవాసం ఉంటారు. ఎందుకంటే కాకరకాయ చేదుగా ఉంటుందని,తింటే అంత రుచిగా ఉండదని అనుకుంటారు. కానీ సరిగ్గా వండితే ఇతర కర్రీల కంటే కాకర కాయ రుచి అద్భుతంగా ఉంటుంది. అంతేకాకుండా చేదుగా ఉండే కాకరకాయలో ఎన్నో పోషక గుణాలు ఉంటాయని డాక్టర్లు చెబుతుంటారు. కాకరకాయ ఉల్లి కారం ఒక్కసారి తిన్నారంటే ఆ టేస్ట్ జన్మలో మర్చిపోరు. వేడి అన్నం,పప్పు చారు,రసం ఇలా దేనితోనైనా తింటే చాలా రుచిగా ఉంటుంది. కాకరకాయ ఉల్లికారం తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం చూడండి.

**కాకరకాయ ఉల్లికారం తయారీకి కావాల్సిన పదార్థాలు**

కాకరకాయ
ఉల్లిపాయ
నూనె
ఉప్పు
పసుపు
కారం
జీలకర్ర
వెల్లుల్లి



ముందుగా 400 గ్రాముల లేత కాకరకాయలను తీసుకొని వాటిపైన చెక్కు తీసుకోండి. తర్వాత కాకరకాయ తల, తోక కట్ చేసి కాకరకాయని రెండు ఇంచు ముక్కలుగా కట్ చేసి ఓ బౌల్ లో వేసుకోండి. ఇప్పుడు కాకరకాయ ముక్కలలో 1 టీస్పూన్ పసుపు, 1 టీస్పూన్ ఉప్పు వేసి బాగా పట్టించి అరగంట సేపు పక్కన ఉంచండి.

అరగంట తర్వాత కాకరకాయల్లో నుంచి నీరు అంతా దిగుతుంది. అప్పుడు ఒక్కో కాకరకాయను బాగా చేతులోకి తీసుకొని పిండితే అందులోని మిగిలిన చేదు కూడా పోతుంది. అలా పిండిన తర్వాత ఆ ముక్కలను పక్కన ఓ ప్లేట్ లో పెట్టుకోండి. ఇప్పుడు మిక్సీ జార్ లో పెద్దగా కట్ చేసిన పావు కిలో ఉల్లిపాయలు,8 వెల్లుల్లి రెబ్బలు,1 టీస్పూన్ జీలకర్ర, 2 టేబుల్ స్పూన్ల కారం,కొంచెం ఉప్పు వేసి మెత్తని పేస్ట్ లా చేసుకోండి. తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి పావు కప్పు ఆయిల్ పోసి అది కొంచెం వేడయ్యాక అందులో కాకరకాయ ముక్కలను వేసి 56 నిమిషాలు వేపుకోండి. తర్వాత కాకరకాయ ముక్కలను ఓ ప్లేట్ లోకి తీసుకొని వాటిల్లోని గింజలను తీసేసి మిక్సీలో వేసి చేసుకున్న మిశ్రమాన్ని కాకరకాయ ముక్కల్లో స్టఫ్ గా చేసుకోండి. ఇప్పుడు కాకరకాయలు వేపుకున్న నూనెలోనే మరో 2 టేబుల్ స్పూన్ల నూనె వేసి అందులో స్టఫ్ చేసుకున్న కాకరకాయ ముక్కలను వేయండి. మిగిలిన ఉల్లిపాయ పేస్ట్ ని కూడా అందులో వేసి మీడియం ఫ్లేమ్ మీద 20 నిమిషాలు వేపుకోవాలి.

దింపే ముందు కొంచెం కరివేపాకు చల్లుకోండి. అంతే కరివేపాకు ఉల్లిపాయ కారం రెడీ.



# కలబందను ఎలా వాడాలి?



కలబంద ఆరోగ్యానికి మాత్రమే కాదు.. అందానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని ఉపయోగించి ఎన్నో చర్మ సమస్యలను తగ్గించుకోవచ్చు. అందుకే దీని జెల్ ను డైరెక్ట్ గా ముఖానికి పెట్టేస్తుంటారు. కానీ కలబంద జెల్ ను తీసి అలాగే ముఖానికి పెడితే ఏమౌతుందో తెలుసా? కలబంద జెల్ లో ఎన్నో ఔషద లక్షణాలుంటాయి. ఇది మనకు కెమికల్స్ లాగా ఎలాంటి హాని చేయడదు. అయినప్పటికీ.. దీన్ని డైరెక్ట్ గా అంటే కలబంద గుజ్జును తీసి ముఖానికి పెట్టుకుంటే కొన్ని సమస్యలను ఫేస్ చేయాల్సి వస్తుందని నిపుణఉలు చెబుతున్నారు.

కలబంద జెల్ లో మన శరీరానికి, చర్మానికి మేలు చేసే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కానీ ఈ జెల్ ను అలాగే ముఖానికి పెట్టుకోవడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.

కలబంద జెల్ లో టీ ట్రీ ఆయిల్ తో పాటుగా కొన్ని సహజ పదార్థాలను కలపకుండా ముడి కలబందను ముఖానికి ఉపయోగిస్తే కొన్ని చర్మ సమస్యలు వస్తాయి. ఇది చర్మ రకం, సున్నితత్వం మీద ఆధారపడి ఉంటుంది.

కొంతమందికి ముడి కలబందను ఉపయోగించడం వల్ల ఎలాంటి సమస్యలు రాకపోవచ్చు. కానీ కొంతమందికి అలెర్జీ, దద్దుర్లు, దురద, చర్మం ఎర్రబడటం వంటి సమస్యలు వస్తాయి.


నిజమేంటంటే? కలబంద ప్రతి చర్మ రకానికి సరిపోదు. కాబట్టి దీన్ని ఉపయోగించే ముందు ఇది పడుతుందా? లేదా? అని చెక్ చేసుకోవాలి. నేషనల్ సెంటర్ ఫర్ కాంప్లిమెంటరీ అండ్ ఇంటిగ్రేటివ్ హెల్త్ ప్రకారం.. చర్మానికి లోతైన కోతలు లేదా గాయాలు ఉంటే మాత్రం మీరు ఎట్టిపరిస్థితిలో కలబంద జెల్ ను ఉపయోగించకూడదు. ఎందుకంటే కలబంద జెల్ శస్త్రచికిత్సకు సంబంధించిన లోతైన గాయాలు నయం కావడానికి మీ చర్మ సహజ సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. పలు నివేదికల ప్రకారం.. కలబంద జెల్ ను పెట్టుకునేటప్పుడు కొంతమందికి మంట, దురద వంటి సమస్యలు వచ్చాయి.

ఒకవేళ దీనివల్ల దద్దుర్లు అయితే మాత్రం వెంటనే దీన్ని పెట్టడం ఆపేయాలి. అలాగే చర్మ అంటువ్యాధులు ఉంటే కూడా కలబంద జెల్ ను పెట్టుకోకూడదు. ఎందుకంటే ఇది అంటువ్యాధులను మరింత పెంచుతుంది.





# మంచంపై కూర్చొని తింటున్నారా? ఈ ఇబ్బందులు తప్పవు..!



మంచం మీద కూర్చొని భోజనం చేయకూడదని ఇంట్లో పెద్దలు చెప్పడం మనం చాలాసార్లు వినే ఉంటాము. పెద్దలు ఎప్పుడూ నేలపై కూర్చొని తినమని సలహా ఇస్తారు. అయితే దీని వెనుక వారి వాదన ఏమిటంటే.. మంచం మీద కూర్చొని తినడం వల్ల లక్ష్మీ దేవిని అవమానిస్తున్నట్లు అని, ఆలా చేయడం ద్వారా ఆమెకు కోపం వస్తుందని చెబుతుంటారు.

ఇది మతపరమైన కారణం. కానీ, శాస్త్రీయ దృక్కోణంలో కూడా మీ ఈ అలవాటు సరైనది కాదు. సుఖం కోసం మీరు కూడా మంచం మీద హాయిగా కూర్చొని తినడం ఆనందిస్తే, ఈ అలవాటు మీ ఆరోగ్యానికి చాలా హానికరం కలిగిస్తుంది. నిజానికి మనం ఏం తింటున్నాం? ఎలా తింటున్నాం? అనేది కూడా చాలా ముఖ్యం. కాబట్టి, మీరు మంచం మీద కూర్చొని ఆహారం ఎందుకు తినకూడదో ఒకసారి చూద్దాం..

**జీర్ణక్రియపై చెడు ప్రభావం:**

నేలపై కూర్చునే భంగిమ కంటే బెడ్‌లోని భంగిమ రిలాక్సింగ్‌గా మారుతుంది. భోజనం చేసేటప్పుడు రెండు భంగిమలు మీ జీర్ణక్రియకు మంచివి కావు. ఇది మీ జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

కొన్నిసార్లు ఇది కడుపులో భారం, యాసిడ్ రిఫ్లక్స్ కు కారణమవుతుంది. ఈ నేపథ్యంలో మంచం మీద కూర్చొని ఆహారం తినాల్సి వస్తే నిటారుగా కూర్చొని సరైన భంగిమలో తినడానికి ప్రయత్నించండి.

**నిద్ర ప్రభావితం**

ప్రతిరోజూ బెడ్‌పై ఆహారం



తీసుకోవడం కూడా మన నిద్రపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఇలా చేయడంవల్ల మన శరీరం ఒక నిర్దిష్ట

కార్యకలాపాలను బాగా గుర్తిస్తుంది. పడక ఎప్పుడూ నిద్రతో ముడిపడి ఉన్నట్లే, స్టడీ టేబుల్ ఎప్పుడూ చదువులతో ముడిపడి ఉంటుంది. కానీ, మీరు మంచం మీద పడుకునే బదులు ఆహారం తిన్నప్పుడు అది మీ మనస్సుకు కొంచెం గందరగోళంగా అనిపించవచ్చు. ప్రతిరోజూ ఇలా చేయడం వల్ల, మీరు కొన్నిసార్లు మంచం మీద పడుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు.

**వేగంగా ఊబకాయం**

మంచం మీద భోజనం చేయడం వల్ల మీ బరువు వేగంగా పెరుగుతుంది. దీని వెనుక చాలా ఆసక్తికరమైన మానసిక కారణం ఉంది. నిజానికి మీరు రిలాక్స్ మూడ్‌లో బెడ్‌పై కూర్చొని ఆహారం తిన్నప్పుడు, సాధారణంగా టీవీ లేదా మొబైల్‌లో వినోదం కూడా దానితో పాటు కొనసాగుతూనే ఉంటుంది. అలా హాయిగా తిండి తిన్నప్పుడు చాలా సార్లు రెండు పూటలా ఆకలితో కాస్త ఎక్కువగానే తినేస్తాం. రోజువారీ ఈ చిన్న అదనపు కేలరీలు మీ బరువు పెరగడానికి కారణమవుతాయి.

**అలెర్జీల సంక్రమణ ప్రమాదం**

మంచం మీద కూర్చొని ఆహారం తినేటపుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని ఆహారపు రేణువులు బెడ్ పైనే ఉండిపోతాయి. ఈ చిన్న కణాలు చాలా రోజులు బెడ్ లేదా బెడ్ షీట్స్ లో ఉంటాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.